PRGI RNI : TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

vaarthasadhya@gmail.com  epaper.vaarthasadhya.com

Published From : Rangareddy  VOLUME : 01  Issue : 248  Wednesday 26-08-2026  Editor : Seggem Kiran Kumar  Pages : 08  Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

విలేకరులు కావలెను!

మా వార్త సంధ్య పత్రిక మరియు వార్త సంధ్య టీవీ కోసం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
గ్రేటర్ హైదరాబాద్ మరియు రంగారెడ్డి
జిల్లాలోని అన్ని డివిజన్, మండలాలలో కావలెను.

విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక, రాజకీయ మరియు ప్రజా సమస్యలపై పరిశోధనాత్మక వార్తల సేకరణ కొరకు మండల స్థాయి విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

7369122101 vaarthasadhya@gmail.com

9951751662 epaper.vaarthasadhya.com

13-22/43, Plot No:203, VV Nagar Colony, Gaddiannaram, Ranga Reddy Dist. - Hyderabad, Telangana 500060



## అందుబాటులోకి స్వదేశీ ఏకే-47

- పూర్తి స్వదేశీ విడిభాగాలతో తొలి ఏకే-203 రైఫిల్ విజయవంతం
- అమేథీ కోర్వా కేంద్రంలో తయారైన భారతీయ ఏకే-203
- బర్స్ట్ ఫైరింగ్ సహా ప్రారంభ పరీక్షల్లో ఉత్తీర్ణత
- లైసెన్స్ అసెంబ్లీ నుంచి పూర్తి స్వదేశీ తయారీ దశకు భారత్
- సెప్టెంబర్‌లో సైన్యం విస్తృత స్థాయి ఫీల్డ్ ట్రయల్స్
- 6 లక్షలకు పైగా రైఫిళ్ల సరఫరాకు లక్ష్యంగా ఇండో-రష్యన్ రైఫిల్స్
- ప్రతి 100 సెకన్లకు ఒక రైఫిల్ తయారీ సామర్థ్యంపై దృష్టి
- మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌కు మరో కీలక మైలురాయి

02

రక్షణ రంగంలో ఆత్మనిర్భర భారత్‌కు మరో కీలక మైలురాయి చేరుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ జిల్లా కోర్వాలో పూర్తిగా స్వదేశీ విడిభాగాలు, ముడి పదార్థాలతో తయారైన తొలి ఏకే-203 అసాల్ట్ రైఫిల్ విజయవంతంగా పరీక్షలను పూర్తి చేసింది. ఈ విజయంతో లైసెన్స్ ఆధారిత అసెంబ్లీ దశను దాటి పూర్తి స్వదేశీ ఆయుధ తయారీ సామర్థ్యాన్ని భారత్ చాటుకుంది. భారత సైన్యంలో ఇన్సాస్ రైఫిళ్ల స్థానంలో ఏకే-203లను ప్రవేశపెట్టే ప్రక్రియకు ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు.




## ఏడాదిలోగా దేవాదుల పూర్తి

- బదిలీ చేసేందుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం
- దేశీయ ఉత్పత్తి సామర్థ్యాల పెంపే కేంద్ర లక్ష్యం
- ప్రైవేట్ సంస్థల ఎంపికకు పోటీ వేలం నిర్వహణ
- అగ్ని సిరీస్ వ్యూహాత్మక మిస్సైళ్లకు మినహాయింపు
- అస్త్రా, ప్రళయ్ సహా పలు మిస్సైల్ టెక్నాలజీల బదిలీ
- తక్కువ వ్యయంతో భారీ ఉత్పత్తికి మార్గం సుగమం
- రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని బలోపేతం చేసే చర్య
- ఎంఎస్ఎంఈలకు సప్లై చైన్‌లో కొత్త అవకాశాలు
- పరిశోధన దశ నుంచి పారిశ్రామిక ఉత్పత్తి దశకు వేగవంతమైన మార్పు

హైదరాబాద్

దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించనున్నట్లు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దనసరి అనసూయ సీతక్క తో కలిసి దేవాదుల పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 6,000 కోట్లు కేటాయించామనీ, ఇప్పటి వరకు రూ.2,500 కోట్లు విడుదలయ్యాయని మంత్రి వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు కూడా ఇటీవల భూసేకరణ కోసం నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. అవసరమైన ప్రక్రియలు పూర్తయిన వెంటనే మిగిలిన నిధులను సైతం సమకూరుస్తామని తెలిపారు. ఇకపై విధానపరమైన, పరిపాలనా లేదా కాంట్రాక్టు

-మిగతా 2 లో



## ప్రైవేటుకు మిస్సైల్ టెక్నాలజీ

- బదిలీ చేసేందుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం
- దేశీయ ఉత్పత్తి సామర్థ్యాల పెంపే కేంద్ర లక్ష్యం
- ప్రైవేట్ సంస్థల ఎంపికకు పోటీ వేలం నిర్వహణ
- అగ్ని సిరీస్ వ్యూహాత్మక మిస్సైళ్లకు మినహాయింపు
- అస్త్రా, ప్రళయ్ సహా పలు మిస్సైల్ టెక్నాలజీల బదిలీ
- తక్కువ వ్యయంతో భారీ ఉత్పత్తికి మార్గం సుగమం
- రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని బలోపేతం చేసే చర్య
- ఎంఎస్ఎంఈలకు సప్లై చైన్‌లో కొత్త అవకాశాలు
- పరిశోధన దశ నుంచి పారిశ్రామిక ఉత్పత్తి దశకు వేగవంతమైన మార్పు

నేషనల్ బ్యూరో:

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన అన్ని రకాల సంప్రదాయ మిస్సైల్ సిస్టమ్ టెక్నాలజీని దేశీయంగా ఉత్పత్తి చేయడం కోసం భారతీయ ప్రైవేట్ రక్షణ రంగానికి బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం ఆమోదం తెలిపారు. ఈ ఆయుధాలను పరిశోధన,

-మిగతా 2 లో

# ప్రజల భూములను బంధిస్తే ఊరుకోం

### -22ఏ నుంచి భూములను వెంటనే తొలగించాలి

- సెప్టెంబర్ 7న అసెంబ్లీ ముట్టడిస్తాం
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.. తప్పు చేసిన వారిని శిక్షించాలి : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే కెపి.వివేకానంద్
- కుత్బుల్లాపూర్‌లో 22-ఏపై ప్రత్యేక సమావేశం



-దుండిగల్/ కుత్బుల్లాపూర్

ప్రజల భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చి బంధిస్తే ఊరుకునేది లేదని, సెప్టెంబర్ 7న అసెంబ్లీని ముట్టడిస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ కుత్బులాపూర్ నియోజకవర్గంలోని భూములను అకారణంగా 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చిన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపి, అర్హులైన భూ యజమానుల భూములను జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. షాపూర్‌నగర్‌లోని ఎం.జే. గార్డెన్స్‌లో మంగళవారం నియోజకవర్గ 22-ఏ బాధితుల సమస్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..

-మిగతా 2 లో

## విస్తరణ దిశగా కాక్రోచ్ పార్టీ!

- కొత్త సభ్యులను ప్రకటించిన సీజేపీ
- దేశవ్యాప్తంగా సంస్థాగత బలోపేతానికి సీజేపీ కొత్త అడుగులు
- ఉత్తర, తూర్పు, పశ్చిమ జోన్లకు ప్రత్యేక సమన్వయ కమిటీలు
- రాష్ట్రాల వారీగా ఇన్‌ఛార్జ్లు, జాతీయ స్థాయి బాధ్యుల నియామకం
- యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులను ఏకం చేయడమే లక్ష్యం: అభిజీత్ దీప్కే
- గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బలమైన పార్టీ నిర్మాణం
- సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్' కార్యక్రమానికి శ్రీకారం
- ప్రజల సమస్యల ఆధారంగా ప్రజా కేంద్రిత కార్యాచరణ రూపొందించనున్న సీజేపీ

02

దేశవ్యాప్తంగా సంస్థాగత బలోపేతానికి సీజేపీ మరో కీలక అడుగు వేసింది. కొత్త సభ్యులను ప్రకటించడంతో పాటు పలు రాష్ట్రాలు, జోన్లకు సంస్థాగత బృందాలను నియమించింది. యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు, సామాన్య ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో పార్టీ విస్తరణ కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త ప్రజా సంభాషణ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజా సమస్యల ఆధారంగా కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు.




# మూసీ ప్రాజెక్టు భూసేకరణకు వేగం పెంచాలి

### ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానం రూపొందించాలన్న రేవంత్

- ఫేజ్-2 పనులకు త్వరలోనే టెండర్లు పిలవాలని సూచన
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల సేకరణలో న్యాయపరమైన జాగ్రత్తలు
- మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రుణాలపై దృష్టి
- ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి వెంటనే టెండర్ల పిలుపు
- కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని సూచన
- ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహణ

హైదరాబాద్

హైదరాబాద్ నగర అభివృద్ధిలో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు అమలుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం

-మిగతా 2 లో






## తెలంగాణలో విస్తారంగా వర్షాలు

- నిండుతున్న ప్రాజెక్టులు
- జలకళను సంతరించుకుంటున్న పలు ప్రాజెక్టులు
- వరద నీటితో సింగరేణి గనుల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు
- మెదక్ జిల్లాలో అత్యధికంగా 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

హైదరాబాద్

అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, పలు ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. ఎండిపోతున్న పంటలకు జీవం పోసిన ఈ వర్షాలు రైతుల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. మరోవైపు, భారీ వర్షాల కారణంగా సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. గడిచిన 24 గంటల్లో మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో అత్యధికంగా 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాల్లోనూ పలుచోట్ల భారీ

-మిగతా 2 లో




02

## దేశంలో విజృంభిస్తున్న H1N1 వైరస్..

- దేశంలోని పలు రాష్ట్రాల్లో పెరుగుతున్న హెచ్1ఎన్1 కేసులు
- ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నది కొత్త వైరస్ కాదన్న ఐసీఎంఆర్
- 2009 మహమ్మారికి కారణమైన అదే వైరస్ ఇప్పటికీ కొనసాగింపు
- ఎక్కువ కేసుల్లో స్వల్ప లక్షణాలే.. భయపడాల్సిన అవసరం లేదన్న నిపుణులు
- దేశవ్యాప్తంగా సెంటినెల్ నిఘా వ్యవస్థతో నిరంతర పర్యవేక్షణ
- హెచ్1ఎన్1తో పాటు ఇతర శ్వాసకోశ వైరస్‌లపై కూడా నిఘా
- వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
- మాస్క్, చేతుల పరిశుభ్రత, విశ్రాంతితో ఫ్లూపై నియంత్రణ సాధ్యం

## హిజాబ్ తప్పనిసరి కాదు

- అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు
- విద్యాసంస్థల డ్రెస్ కోడ్‌కు విద్యార్థులు కట్టుబడి ఉండాల్సిందే
- యూనిఫామ్‌తో పాటు హిజాబ్‌కు అనుమతి కోరిన పిటిషన్ కొట్టివేత
- వ్యక్తిగత అభిరుచుల మేరకు యూనిఫామ్ మార్పులకు అవకాశం లేదన్న ధర్మాసనం
- క్రమశిక్షణ, సమానత్వం కోసం డ్రెస్ కోడ్ అమలు సమర్థనీయం
- హిజాబ్‌పై గత తీర్పులను ప్రస్తావించిన అలహాబాద్ హైకోర్టు

02



vaartha sandhya వార్త సంధ్య
vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

# విస్తరణ దిశగా కాక్రోచ్ పార్టీ!

**- కొత్త సభ్యులను ప్రకటించిన సీజేపీ**
**-దేశవ్యాప్తంగా సంస్థాగత బలోపేతానికి సీజేపీ కొత్త అడుగులు**
**-ఉత్తర, తూర్పు, పశ్చిమ జోన్లకు ప్రత్యేక సమన్వయ కమిటీలు**
**-రాష్ట్రాల వారీగా ఇన్‌ఛార్జు, జాతీయ స్థాయి బాధ్యుల నియామకం**
**-సభ్యత్వ విస్తరణతో పాటు ప్రజా సమస్యలపై ఉద్యమాలకు ప్రాధాన్యం**
**-యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులను ఏకం చేయడమే లక్ష్యం: అభిజీత్ దీప్కే**
**-గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బలమైన పార్టీ నిర్మాణం**
**-సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్' కార్యక్రమానికి శ్రీకారం**
**-ప్రజల సమస్యల ఆధారంగా ప్రజా కేంద్రిత కార్యాచరణ రూపొందించనున్న సీజేపీ**

న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా సంస్థాగత బలోపేతానికి మరో కీలక అడుగు వేస్తూ సీజేపీ కొత్త సభ్యులను ప్రకటించడంతో పాటు వివిధ రాష్ట్రాలు, జోన్లకు సంబంధించిన సంస్థాగత బృందాలను ఆవిష్కరించింది. పార్టీ విస్తరణ, సమన్వయం, ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఈ కొత్త నియామకాలు చేపట్టినట్లు పార్టీ వెల్లడించింది. దేశ వ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి ఉత్తర, తూర్పు, పశ్చిమ జోన్లకు ప్రత్యేక కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు ఆయా ప్రాంతాల్లో సభ్యత్వ విస్తరణ, కార్యక్రమాల నిర్వహణ, రాష్ట్ర యూనిట్ల మధ్య సమన్వయ బాధ్యతలు నిర్వర్తించనున్నాయి. సంస్థాగత విస్తరణలో భాగంగా పలు రాష్ట్రాలకు కొత్త ఇన్‌ఛార్జు, సమన్వయకర్తలు, జాతీయ స్థాయి బాధ్యులను నియమించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు స్థానిక సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా ఈ బృందాలు పనిచేయనున్నట్లు పార్టీ తెలిపింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు, సామాన్య ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను పెంచుతూ గ్రామం నుంచి జాతీయ స్థాయి వరకు బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా క్యా బోల్తీ పబ్లిక్ పేరుతో ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా యువత, విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి ఆధారంగా ప్రజా కేంద్రిత కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపింది.

# తెలంగాణలో విస్తారంగా వర్షాలు

మొదటి తరువాయి

వర్షాలు కురిసాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ వర్షాలతో గోదావరి బేసిన్లోని ప్రాజెక్టులు నిండుతున్నాయి.
నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టానికి (1,405 అడుగులు) చేరువ కాగా, ప్రస్తుతం నీటిమట్టం 1,401 అడుగులకు చేరింది. శ్రీరామ్ సాగర్ జలాశయంలో నీటిమట్టం 44 టీఎంసీలు దాటింది. కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండటంతో 17 గేట్లు ఎత్తి 74,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్ కు వరద పోటెత్తడంతో 85 గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. మరోవైపు, భారీ వర్షాల కారణంగా ఇల్లందు, మణుగూరులోని సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లోకి వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. కాగా, రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు (ఆగస్టు 28 వరకు) తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు 26 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# హిజాబ్ తప్పనిసరి కాదు

**-అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు**
**-విద్యాసంస్థల డ్రెస్ కోడ్‌కు విద్యార్థులు కట్టుబడి ఉండాల్సిందే**
**-యూనిఫామ్‌తో పాటు హిజాబ్‌కు అనుమతి కోరిన పిటిషన్ కొట్టివేత**
**-వ్యక్తిగత అభిరుచుల మేరకు యూనిఫామ్ మార్పులకు అవకాశం లేదన్న ధర్మాసనం**
**-క్రమశిక్షణ, సమానత్వం కోసం డ్రెస్ కోడ్ అమలు సమర్థనీయం**
**-వివక్షారహిత నిబంధనలను అమలు చేసే అధికారం విద్యాసంస్థలకే**
**-హిజాబ్‌పై గత తీర్పులను ప్రస్తావించిన అలహాబాద్ హైకోర్టు**



, నేషనల్ బ్యూరో:
ఇస్లాంలో మహిళలు హిజాబ్ ధరించడం తప్పనిసరియైన మత ఆచారం కాదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. విద్యా సంస్థలు నిర్ణయించిన డ్రెస్ కోడ్‌ను తమ వ్యక్తిగత ప్రాధాన్యతల ప్రకారం మార్చే హక్కు ఏ విద్యార్థికీ లేదని తేల్చిచెప్పింది. పాఠశాల యూనిఫామ్‌తోపాటు హిజాబ్ ధరించేందుకు అనుమతించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ప్రయాగ్‌రాజ్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి, అదే పాఠశాలలో 11వ తరగతిలో చేరాలనుకుంటున్న ఒక మైనర్ విద్యార్థిని తరపున ఆమె తల్లి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.
హిజాబ్ ధరించడం ఇస్లాం మత ఆచారంలో అత్యంత ముఖ్యమైన భాగమని, ఆరో తరగతి నుండి తాము ఇదే పాఠశాలలో హిజాబ్ ధరిస్తున్నామని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ ఇంద్రజిత్ శుక్లాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించి ఆగస్టు 21న తీర్పు వెలువరించింది. హిజాబ్ ధరించడం అనేది ఇస్లాం మతాచారంలో అత్యంత ముఖ్యమైన భాగం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. హిజాబ్ ధరించకపోతే మత విశ్వాసానికి భంగం వాటిల్లుతుందనే వాదనను గతంలో వివిధ హైకోర్టులు కూడా తోసిపుచ్చాయని గుర్తుచేసింది. విద్యా సంస్థలలో క్రమశిక్షణ, సమానత్వాన్ని కాపాడేందుకు అమలు చేసే యూనిఫామ్ నిబంధనలు వివక్షారహితంగా ఉన్నంత కాలం, వాటిని అమలు చేసే పూర్తి అధికారం ఆయా సంస్థలకు ఉంటుందని కోర్టు తెలిపింది.

# ప్రజల భూములను బంధిస్తే ఊరుకోం

మొదటి తరువాయి

తెలంగాణలో 22-ఏ కేవలం రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమస్య కాదని, వేలాది మంది భూ యజమానుల భవిష్యత్‌కు సంబంధించిన అంశమని అన్నారు. భూములను విక్రయించలేక, రిజిస్ట్రేషన్ చేయించుకోలేక, బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక భూ యజమానులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22-ఏ అంటే కేవలం ఒక నంబర్ కాదని.. ఒక కుటుంబం భవిష్యత్‌పై పడే తాళం అని అన్నారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భూభారతి సాక్షిగా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, 2023 డిసెంబర్ నుంచి 22-ఏ జాబితాలో చేర్చిన, తొలగించిన సర్వే నంబర్లకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు బహిర్గతం చేయాలని కోరారు. ప్రభుత్వం 22-ఏ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 7వ తేదీలోగా సమస్యను పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని, అసెంబ్లీ లోపల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రజల తరఫున పోరాడుతారని, బయట బీఆర్ఎస్ శ్రేణులు ఉద్యమాన్ని కొనసాగిస్తాయని తెలిపారు.
?ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. 22-ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూసీ ప్రాజెక్టు భూసేకరణకు వేగం పెంచాలి

మొదటి తరువాయి

పలు కీలక అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతిని సమీక్షించిన ఆయన, మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు రెండో దశ (ఫేజ్-2) పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. ప్రాజెక్టు అమలు వేగవంతం కావాలంటే భూసేకరణ, ఆర్థిక వనరుల సమీకరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియలో ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లు, అసైన్డ్ భూముల సేకరణ వంటి సున్నితమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఈ అంశాలకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలను రూపొందించి, వాటిని కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు తెలిపారు. భూసేకరణలో న్యాయపరమైన వివాదాలు లేదా కోర్టు కేసులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. మూసీ రివర్‌ఫ్రంట్ పరిధిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణపై కూడా సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రాజెక్టులకు అతి తక్కువ వడ్డీ రేట్లతో రుణ సదుపాయాలు పొందే అవకాశాలను పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు ఆర్థిక సంస్థల ద్వారా కూడా నిధుల సమీకరణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా, భూసేకరణకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించే ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్‌లు) జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. టీడీఆర్‌ల జారీ, వాటి అమలు పురోగతిపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని సూచించారు. దీనివల్ల భూసేకరణలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రాజెక్టు అమలుకు సహకారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో గండిపేట మంచిరేవుల సమీపంలో నిర్మించనున్న ఓంకారేశ్వరస్వామి ఆలయ ప్రాజెక్టుపై కూడా చర్చ జరిగింది. ఆలయ నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా తక్షణమే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్వాల్‌గూడలో అభివృద్ధి చేస్తున్న బర్డ్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని కూడా సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ఈ పార్క్ దోహదపడేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే కీలక ప్రాజెక్టుగా ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో, భూసేకరణ నుంచి నిర్మాణ పనుల వరకు ప్రతి దశను వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రంగారెడ్డి మరియు మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ, జేఎండీతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏడాదిలోగా దేవాదుల పూర్తి

మొదటి తరువాయి

సంబంధిత సమస్యల పేరుతో దేవాదుల పనులు సాగదీయడానికి అవకాశం ఉండదని ఉత్తమ్ స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు ప్రతి కాంపోనెంట్‌ను విడివిడిగా పరిశీలించి నిలిచి పోయిన పనులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, ఇతర పరిపాలనా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయి, అవార్డులు ఖరారైన చోట నిధుల విడుదలలో జాప్యం ఉండకూడదన్న ప్రభుత్వ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇదే అంశంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లకు మార్గదర్శకాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల సంబంధిత ఇతర విభాగాల అధికారుల సమన్వయంతో పనిచేసి పనులకు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

6 లక్షల ఎకరాలకు సాగునీరు

దేవాదుల ప్రాజెక్టు ద్వారా 38 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోసి, దాదాపు 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్టు ఉత్తమ్ తెలిపారు. హన్మకొండ, వరంగల్, కరీంనగర్, జనగామ, యాదాద్రి--భువనగిరి, సూర్యాపేట, సిద్ధిపేట, మేడ్చల్--మల్కాజిగిరి, ములుగు, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాలు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం పొందనున్నారని వెల్లడించారు. రెండు దశాబ్దాల క్రితం చేపట్టిన ప్రాజెక్టు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలిపోవడం దురదృష్టకరమన్నారు. ఇకపై జాప్యానికి తావులేకుండా, ప్రాధాన్యతతో పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం అందుబాటులో ఉన్న పంపింగ్ వ్యవస్థలన్నింటిని పూర్తి సామర్థ్యంతో వినియోగించి, గోదావరి నుంచి సాధ్యమైనంత గరిష్ఠ పరిమాణంలో నీటిని ఎత్తిపోస్తామని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు సాగు నీరందించడంతో పాటు రిజర్వాయర్లను నింపాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాం నాయక్, సీనియర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.౦

## ప్రైవేటుకు మిస్సైల్ టెక్నాలజీ

మొదటి తరువాయి

అభివృద్ధి దశ నుండి ప్రత్యక్ష పారిశ్రామిక ఉత్పత్తి దశకు వేగంగా తరలించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ టెక్నాలజీ బదిలీ హక్కులను పొందడానికి, అభివృద్ధి, ఉత్పత్తి భాగస్వామిగా ఎంపిక కావడానికి, అలాగే డీఆర్‌డీవో భాగస్వామ్యంతో ఈ మిస్సైల్ సిస్టమ్‌ల అనుసంధానాన్ని చేపట్టడానికి భారతీయ ప్రైవేట్ సంస్థల మధ్య పోటీ వేలం నిర్వహించనున్నారు. అయితే, అగ్ని సిరీస్ వంటి అణు సామర్థ్యం ఉన్న వ్యూహాత్మక మిస్సైళ్లను దీని నుంచి మినహాయించినట్లు తెలుస్తోంది.
ట్రాన్స్‌ఫర్ అయ్యే మిస్సైల్స్ ఇవే..
వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్స్, యాంటీ షిప్ మిస్సైల్స్, అస్త్రా ఎయిర్-టు-ఎయిర్ మిస్సైల్, ప్రళయ్ సర్ఫేస్-టు-సర్ఫేస్ క్వాసి-బాలిస్టిక్ మిస్సైల్ వంటి సంప్రదాయ ఆయుధ టెక్నాలజీలను ప్రైవేట్ రంగానికి లైసెన్స్ ప్రాతిపదికన అందించనున్నారు. సంప్రదాయ మిస్సైళ్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడానికి, తక్కువ వ్యయంలో భారీగా ఉత్పత్తి చేయడానికి, దేశీయ తయారీ సామర్థ్యాలను పెంచడం, రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని బలోపేతం చేయడం, సప్లై చైన్‌లో భారతీయ ఎంఎస్ఎంఈల భాగస్వామ్యం కావడానికి అవకాశాలను సృష్టించే లక్ష్యాలతో రక్షణ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది.

# దేశంలో విజృంభిస్తున్న హెచ్1ఎన్1 వైరస్..

**-దేశంలోని పలు రాష్ట్రాల్లో పెరుగుతున్న హెచ్1ఎన్1 కేసులు**
**-ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నది కొత్త వైరస్ కాదన్న ఐసీఎంఆర్**
**-2009 మహమ్మారికి కారణమైన అదే వైరస్ ఇప్పటికీ కొనసాగింపు**
**-ఎక్కువ కేసుల్లో స్వల్ప లక్షణాలే.. భయపడాల్సిన అవసరం లేదన్న నిపుణులు**
**-దేశవ్యాప్తంగా సెంటినెల్ నిఘా వ్యవస్థతో నిరంతర పర్యవేక్షణ**
**-హెచ్1ఎన్1తో పాటు ఇతర శ్వాసకోశ వైరస్‌లపై కూడా నిఘా**
**-వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**
**-మాస్క్, చేతుల పరిశుభ్రత, విశ్రాంతితో ఫ్లూపై నియంత్రణ సాధ్యం**




దేశంలోని పలు రాష్ట్రాల్లో హెచ్1ఎన్1 రకం వైరస్ కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీనిపై 'భారత వైద్య పరిశోధనా మండలి ' స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నది కొత్త వైరస్ కాదని తెలిపింది. 2009లో మహమ్మారికి కారణమైన అదే ఇన్‌ఫ్లుయెంజా-ఏ (హెచ్1ఎన్1) పీడీఎం09 వైరస్ ఇప్పుడు ఫ్లూగా కొనసాగుతోందని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ వెల్లడించారు.ప్రతి సీజన్‌లో వైరస్‌లో చిన్నపాటి జన్యు మార్పులు సహజంగానే జరుగుతాయని చెప్పారు. దానివల్ల కొత్తగా మరింత ప్రమాదకరమైన వైరస్ పుట్టినట్లుగా భావించాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ భాగం స్వల్ప లక్షణాలతోనే తగ్గిపోతున్నాయని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. హెచ్1ఎన్1పై ఐసీఎంఆర్ నిరంతరం నిఘా కొనసాగిస్తోంది. దేశవ్యాప్తంగా 73 ప్రత్యేక ఆసుపత్రులతో కూడిన సెంటినెల్ నిఘా వ్యవస్థ ద్వారా ప్రతివారం శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల నమూనాలను పరీక్షిస్తున్నారు. తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులతో వచ్చే రోగులు, ఫ్లూ లక్షణాలతో వచ్చే వారి నుంచి నమూనాలు సేకరిస్తున్నారు. మరో 167 వైరస్ పరిశోధన, నిర్ధారణ ప్రయోగశాలలు కూడా పరీక్షలు నిర్వహిస్తున్నాయి. హెచ్1ఎన్1తోపాటు హెచ్3ఎన్2, ఇన్‌ఫ్లుయెంజా-బి, కొవిడ్-19, హెచ్ఎంపీవీ, అడెనోవైరస్ వంటి ఇతర వైరస్‌లను కూడా పరీక్షల్లో గుర్తిస్తున్నారు. ప్రస్తుతం హెచ్3ఎన్2 కేసులు 2-3 శాతం వరకు ఉన్నాయని ఐసీఎంఆర్ తెలిపింది. వృద్ధులు, ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. వీరిలో ఫ్లూ తీవ్రంగా మారి న్యుమోనియా వంటి సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది. అవసరాన్ని బట్టి వైద్యుల సూచనతో సీజనల్ ఫ్లూ టీకా తీసుకోవచ్చని ఐసీఎంఆర్ తెలిపింది. హెచ్1ఎన్1 వైరస్‌వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్‌కు యాంటీబయాటిక్స్ పనిచేయవు. అవసరమైన సందర్భాల్లో వైద్యుల పర్యవేక్షణలో యాంటీవైరల్ మందులు వాడాలి. జ్వరం, దగ్గు వంటి లక్షణాలు ఉంటే ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవడం, దగ్గేటప్పుడు నోరు మూసుకోవడం, చేతులు తరచూ శుభ్రం చేసుకోవడం, రద్దీ ప్రదేశాల్లో మాస్క్ ధరించడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

# అందుబాటులోకి స్వదేశీ ఏకే-47

**- 100 శాతం స్వదేశీ ఏకే-203 షేర్ రైఫిల్**
**- విజయవంతమైన పరీక్షలు నిర్వహణ**
**- అమేథీ జిల్లా కోర్వాలో తయారీ**

లక్నో:
భారత్ రక్షణ రంగంలో ఆత్మనిర్భరత దిశగా మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఉత్తరప్రదేశ్ లోని అమేథీ జిల్లా కోర్వా ఆయుధ తయారీ కేంద్రంలో పూర్తిగా స్వదేశీ విడిభాగాలతో తయారైన తొలి ఏకే-203 షేర్ అసాల్ట్ రైఫిల్ను విజయవంతంగా పరీక్షించారు. ఇప్పటివరకు తయారైన ఏకే-203 రైఫిళ్లలో కొన్ని విడిభాగాలు రష్యా నుంచి దిగుమతి చేసుకోగా, ఈ కొత్త నమూనాలో ఉపయోగించిన ప్రతి భాగం, ముడి పదార్థం పూర్తిగా భారత పరిశ్రమల నుంచే సమకూర్చబడింది. ఈ రైఫిల్ను ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తయారు చేసింది. ఇది భారత్, రష్యాల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన సంస్థ. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా భారత సైన్యానికి ఆధునిక ఆయుధాలను దేశీయంగా తయారు చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ విజయంతో లైసెన్స్ ఆధారిత అసెంబ్లీ దశ నుంచి పూర్తి స్వదేశీ తయారీ దశకు భారత్ చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.

బర్స్ట్ ఫైరింగ్ విజయవంతం

ఫైర్ రైఫిల్ పై నిర్వహించిన ప్రారంభ పరీక్షల్లో బర్స్ట్ ఫైరింగ్ తో పాటు ఇతర సాంకేతిక పరీక్షలు విజయవంతమయ్యాయి. రైఫిల్ పనితీరు ఆశాజనకంగా ఉన్నట్లు ఇండో-రష్యన్ రైఫిల్స్ సంస్థ



వెల్లడించింది. తదుపరి భారత సైన్యం సెప్టెంబర్ లో విస్తృత స్థాయి ఫీల్డ్ ట్రాయల్స్ పరీక్షల్లో కూడా విజయవంతమైతే భారత సైన్యంలో అధికారికంగా ప్రవేశపెట్టే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏకే-203 రైఫిల్ 7.62 ఓఅఎవం 39 మిల్లీమీటర్ల మందుగుండు సామగ్రిని ఉపయోగిస్తుంది. ఇది నిమిషానికి సుమారు 700 రౌండ్ల వరకు కాల్పులు జరపగలదు. సమర్థవంతమైన కాల్పుల పరిధి దాదాపు 800 మీటర్ల వరకు ఉంటుంది. తక్కువ నిర్వహణతో కఠిన వాతావరణ పరిస్థితుల్లో కూడా విశ్వసనీయంగా పనిచేసేలా దీనిని రూపొందించారు. ఆధునిక పికాటినీ రైఫిల్ వ్యవస్థ ఉండటంతో నైట్ విజన్ పరికరాలు, ఆప్టికల్ సైట్లు వంటి అదనపు పరికరాలను అమర్చుకోవచ్చు.

ఇన్సాస్ రైఫిళ్లకు బదులుగా..

భారత సైన్యంలో ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఇన్సాస్ రైఫిళ్ల స్థానంలో ఏకే-203 రైఫిళ్లను దశలవారీగా ప్రవేశపెడుతున్నారు. మొత్తం 6 లక్షలకు పైగా ఏకే-203 రైఫిళ్లను సరఫరా చేసే ప్రణాళిక అమల్లో ఉంది. పూర్తి స్వదేశీకరణతో ఉత్పత్తి వేగాన్ని కూడా పెంచాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్తులో ప్రతి 100 సెకన్లకు ఒక రైఫిల్ తయారు చేసే సామర్థ్యాన్ని సాధించాలని యోచిస్తోంది.

పూర్తి స్వదేశీ తయారీ : ఎస్ కే శర్మ

ఇండో-రష్యన్ రైఫిల్స్ సీఈఓ మేజర్ జనరల్ ఎస్.కే. శర్మ మాట్లాడుతూ ఈ విజయం కేవలం కొన్ని భాగాలను దేశీయంగా తయారు చేయడం కాదని, రైఫిల్ లోని ప్రతి భాగం, ప్రతి ముడి పదార్థం భారతీయ పరిశ్రమల నుంచే సమకూర్చడం ద్వారా నిజమైన స్వదేశీకరణ సాధించామని తెలిపారు. ఇది భారత రక్షణ తయారీ రంగానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ విజయాన్ని మేక్ ఇన్ ఇండియాలో కీలక మైలురాయిగా రక్షణ రంగ నిపుణులు అభివర్ణిస్తున్నారు. విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, దేశీయ రక్షణ పరిశ్రమను బలోపేతం చేయడంలో ఈ అభివృద్ధి కీలక పాత్ర పోషించనుంది.


# నకిలీ ధ్రువపత్రాలతో పెన్షన్లు పొందుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

## . -ఎంపీడీవోకు గ్రామస్తుల వినతి




**మునుగోడు, :ఆగస్టు -25:(వార్త సంధ్య )**
మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలో వికలాంగుల పెన్షన్ల పంపిణీపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులైన నిరుపేదలు, వికలాంగులకు అందాల్సి ఉండగా, అనర్హులు పెన్షన్లు పొందుతున్నారంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామస్తులు మునుగోడు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసి, పెన్షన్లపై సమగ్ర విచారణ జరిపి నిజమైన అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పలివెల గ్రామంలో వికలాంగుల పెన్షన్ల విషయంలో కొంతమంది మధ్యవర్తులు, బ్రోకర్లు డబ్బులు వసూలు చేసి అర్హత లేని వ్యక్తులకు కూడా ధ్రువపత్రాలు ఇప్పించి పెన్షన్లు పొందేలా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు డబ్బులు తీసుకుంటూ, అర్హత లేని వ్యక్తులకు వైద్య ధ్రువపత్రాలు సృష్టించి ప్రభుత్వ పెన్షన్లు ఇప్పిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.దీంతో నిజంగా వికలాంగులై, ప్రభుత్వ పెన్షన్‌కు అర్హత ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్న పలువురు పేదలకు అన్యాయం జరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదలు, వికలాంగుల సంక్షేమం కోసం కేటాయిస్తున్న నిధులు అర్హత లేని వ్యక్తులకు చేరితే అసలైన లబ్ధిదారులకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.గ్రామస్తుల వివరాల ప్రకారం గతంలో పలివెల గ్రామంలో 82 మంది వికలాంగుల పెన్షన్లు పొందుతుండగా, వారిలో కేవలం 13 మంది మాత్రమే నిజమైన అర్హత కలిగినవారిగా ఉన్నారని వారు పేర్కొన్నారు. మిగిలిన వారిలో కొందరు అనర్హులై ఉండొచ్చని, నకిలీ లేదా అనుమానాస్పద ధ్రువపత్రాల ఆధారంగా పెన్షన్లు పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. అయితే ఈ విషయంపై అధికారులు అధికారికంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని గ్రామస్తులు కోరారు.ఇదే సమయంలో మరో 45 మంది కూడా అనర్హులుగా ఉన్నప్పటికీ వివిధ ధ్రువపత్రాలు సమర్పించి వికలాంగుల పెన్షన్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై అధికారులు వెంటనే స్పందించి అర్హతలపై పూర్తిస్థాయి పరిశీలన చేపట్టాలని, వైద్య ధ్రువపత్రాలను సంబంధిత వైద్య అధికారుల ద్వారా మరోసారి ధృవీకరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పెన్షన్ అర్హుల హక్కు.. బ్రోకర్ల దందాకు కాదు" అని గ్రామస్తులు స్పష్టం చేశారు. అర్హత లేని వ్యక్తులకు పెన్షన్లు అందకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నిజంగా వికలాంగులైన పేదలకు ప్రాధాన్యతనిస్తూ పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు.ప్రభుత్వ ఖజానాపై అనవసరమైన భారం పడకుండా, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అధికారులు తక్షణమే ప్రత్యేక పరిశీలన చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. పెన్షన్లు పొందుతున్న ప్రతి లబ్ధిదారుడి అర్హతను పునఃపరిశీలించి, అర్హత లేనివారు ఉన్నట్లయితే వారి పెన్షన్లు నిలిపివేసి, అక్రమంగా ధ్రువపత్రాలు పొందినట్లు లేదా సమర్పించినట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తులు, మధ్యవర్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా గతంలో పెన్షన్లు పొందుతున్న వారి జాబితాను కూడా పూర్తిస్థాయిలో పరిశీలించి, గ్రామస్థుల సమక్షంలో పారదర్శకంగా అర్హుల జాబితాను రూపొందించాలని కోరారు. నిజమైన అర్హులకు అన్యాయం జరిగితే గ్రామస్థుల తరఫున మరింత పెద్దస్థాయిలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు వరికుప్పల బోడయ్య, పగిళ్ల గోపాల్, చెరుకుపల్లి గోపాల్, గుత్తి కుమార, గోసుకొండ బజారు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ సినియర్ నాయకులు మహమ్మద్ తాజుద్దీన్ గారి మరణం పట్ల సంతాపం బీఆర్ఎస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ నాయకులు షేక్ గౌసుద్దీన్




**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 25(వార్త సంధ్య )**
బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా ముస్లిం మైనారిటీ విభాగం అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్ గారు గుండెపోటుతో మరణించడంతో సంతాపం తెలిపిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకులు షేక్ గౌసుద్దీన్ గారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ తాజుద్దీన్ గారి మరణం చాలా బాధాకరం అని అన్నారు, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి చాలా కృషి చేశారని ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దైవాన్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

## జర్నలిస్టుల పాదయాత్రకు సంఘీభావం తెలిపిన ...ఇమ్మడి




**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 25 (వార్త సంధ్య )**
కారేపల్లి బస్టాండ్ సెంటర్ నుండి ఎ తీ శీ ఆఫీస్ వరకు జర్నలిస్టు ల సమస్య పరిష్కారం కోసం చేపట్టిన పాదయాత్రకు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతి రావు సంఘీభావం తెలిపి మద్దతు ఇచ్చారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోగర శ్రీను తో పాటు కాంగ్రెస్ నాయకులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

## పేరుపల్లిలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమం





**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 25 (వార్త సంధ్య )**
పేరుపల్లి గ్రామంలో దోమల బెడద నివారణకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఫాగింగ్ కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రు పర్యవేక్షణలో గ్రామంలోని డ్రైనేజీలు, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. దోమల కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## రమేష్ రమ్మీ జ్ఞాపకార్థం కేక్ కటింగ్.. కారేపల్లి యువత ఘన నివాళి



**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 25 ( వార్త సంధ్య )**
కారేపల్లి మండలానికి చెందిన యువకుడు అదెర్ల రమేష్ రమ్మీ జ్ఞాపకార్థం కారేపల్లి యువత, స్నేహితులు, అభిమానులు కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. రమేష్ రమ్మీ గత ఏడాది మృతి చెందడంతో, ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని స్నేహితులు, యువత ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా రమేష్‌తో తమకున్న అనుబంధాన్ని స్నేహితులు, శ్రేయోభిలాషులు గుర్తుచేసుకున్నారు. రమేష్ భౌతికంగా తమ మధ్య లేకపోయినా, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ తమతోనే ఉంటాయని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ నివాళులర్పించారు. అనంతరం రమేష్ రమ్మీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి యువత, రమేష్ స్నేహితులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఆయనను స్మరించుకున్నారు. ప్రతి సంవత్సరం రమేష్ జ్ఞాపకార్థం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుతామని యువత తెలిపారు.

## ఎల్ఓసి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే



**నారాయణఖేడ్ ఆగస్టు 25 ( వార్త సంధ్య )**
నారాయణఖేడ్ మున్సిపాలిటీకి చెందిన పుసిని రాజు కుమారుడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా,నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి వెంటనే రూ,2,50,000ల ఎల్ఓసి చెక్కును మంగళవారం తన గృహంలో లబ్దిదారునికి అందజేశారు.ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి,రమేష్ తదితరులు ఉన్నారు

## కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ




**వర్త సంధ్య కూకట్‌పల్లి :**
'యూత్ ఫర్ సేవా' మరియు ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి మండల విద్యాధికారి (ఎంఈవో) రవీందర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై, సుమారు 400 మంది విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రవీందర్ రాజు మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి విద్యార్థులకు బాసటగా నిలుస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పేద విద్యార్థులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి, వాటిని ఉత్తమంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 'యూత్ ఫర్ సేవా' ప్రతినిధులు, సాఫ్ట్‌వేర్ సంస్థ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# భారత డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ సంచలనం

- సామాన్యుడి అరచేతిలోకి చెల్లింపుల వ్యవస్థ
- అరక్షణంలో లావాదేవీలు చేసే సౌలభ్యం
- పదేళ్ల ప్రస్థానంలో ప్రపంచవ్యాప్త గుర్తింపు
- 11 దేశాలకు విస్తరించిన మన యూపీఐ సేవలు

**ఆగస్టు -25:(వార్త సంధ్య )**
విప్లవాత్మక మార్పులతో భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ కొత్త శకానికి నాంది పలికింది. సామాన్యుడికి సైతం సులువైన, సురక్షితమైన ఆర్థిక సేవలు అందించడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ) గత దశాబ్ద కాలంలో దేశీయంగా ఆర్థిక సేవలను పూర్తిగా మార్చేసింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసిన ఈ వేదిక, ప్రస్తుతం భారత్ సరిహద్దులు దాటి 11 దేశాల్లో విజయవంతంగా సేవలు అందిస్తోంది. గ్రీస్, మాల్దీవులు వంటి దేశాలు కూడా ఇటీవల ఈ వేదికను స్వీకరించడం భారత డిజిటల్ ప్రాభవాన్ని చాటుతోంది.

ప్రయోగం నుంచి ప్రజాదరణ వరకు..
యూపీఐ ప్రయాణం 2016 ఏప్రిల్‌లో 21 భాగస్వామ్య బ్యాంకులతో ప్రయోగాత్మకంగా ప్రారంభమైంది. అదే ఏడాది ఆగస్టులో ప్రజల వినియోగానికి అందుబాటులోకి వచ్చింది. డిసెంబరులో ప్రవేశపెట్టిన భీమ్ యాప్ ద్వారా ఒక బ్యాంకు ఖాతా నుంచి మరొక ఖాతాకు నేరుగా నగదు బదిలీ చేసే సౌకర్యం ఏర్పడింది. 2017లో 'డైనమిక్ క్యూఆర్' విధానం రాకతో రిటైల్ వ్యాపార చెల్లింపులు మరింత సులువయ్యాయి. పదేళ్ల కాలంలో ఎన్నో కీలక మైలురాళ్లను దాటుకుంటూ యూపీఐ దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన వెన్నుముకగా మారింది.







సాంకేతిక ఆవిష్కరణలతో విస్తరణ
వినియోగదారుల భద్రత, సౌకర్యం దృష్ట్యా 2018లో యూపీఐ 2.0ను అందుబాటులోకి తెచ్చారు. ఆటోమేటిక్ చెల్లింపుల కోసం మ్యాండేట్స్, ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాల అనుసంధానం, ఇన్వాయిస్ చూసే వెసులుబాటు దీని ద్వారా లభించాయి. 2019లో ఐపీఓ దరఖాస్తులకు యూపీఐ వినియోగానికి సెబీ అనుమతి ఇవ్వడంతో లావాదేవీలు విపరీతంగా పెరిగాయి. అదే సంవత్సరం అక్టోబరులో నెలకు 100 కోట్ల లావాదేవీల మైలురాయిని దాటింది.

సామాన్యులకూ డిజిటల్ సేవలు
చందాలు, బిల్లుల చెల్లింపులకు 'యూపీఐ ఆటోపే', ఫీచర్ ఫోన్ వినియోగదారుల కోసం 'యూపీఐ 123పే', పిన్ అవసరం లేని స్వల్ప మొత్తాల చెల్లింపులకు 'యూపీఐ లైట్' వంటి ఆవిష్కరణలు సామాన్యులను డిజిటల్ పరిధిలోకి తెచ్చాయి. క్రెడిట్ కార్డుల అనుసంధానం, క్రెడిట్ లైన్ సౌకర్యాలతో సేవలు మరింత విస్తరించాయి. 2024లో ప్రాథమిక వినియోగదారుల అనుమతితో పనిచేసే 'యూపీఐ సర్కిల్' అందుబాటులోకి వచ్చింది. అలాగే వేలిముద్ర, ముఖ గుర్తింపు ఆధారిత ధ్రువీకరణ విధానాలు చెల్లింపుల ప్రక్రియను సురక్షితం చేశాయి.

అత్యధిక లావాదేవీల రికార్డు
గడిచిన దశాబ్ద కాలంలో యూపీఐ లావాదేవీల సంఖ్య, విలువలో ఊహించని వృద్ధి నమోదైంది. 2016-17లో వార్షిక లావాదేవీల పరిమాణం 2 కోట్లుగా ఉండగా, 2025-26 నాటికి 24,162 కోట్లకు పైగా పెరిగింది. ఇది దాదాపు 12 వేల రెట్ల వృద్ధి. ఆ కాలంలో రూ. 0.07 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీల విలువ రూ. 314 లక్షల కోట్లకు చేరింది. 2026 జూలై నాటికి ఈ వ్యవస్థలో 741 బ్యాంకులు భాగస్వాములుగా మారగా, ఒక్క నెలలోనే రూ. 29.87 లక్షల కోట్ల విలువైన 2,365.8 కోట్ల లావాదేవీలు జరిగాయి.

ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు
ప్రపంచంలోనే ప్రముఖ తక్షణ చెల్లింపుల వ్యవస్థగా యూపీఐ రికార్డు సృష్టించింది. అంతర్జాతీయ తక్షణ చెల్లింపుల పరిమాణంలో యూపీఐ వాటా ఏకంగా 49 శాతానికి చేరుకుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి తన నివేదికలో ఈ రికార్డును ప్రశంసించింది. భూటాన్‌తో ప్రారంభమైన అంతర్జాతీయ విస్తరణ నేడు నేపాల్, సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్, ఖతార్, కంబోడియా, గ్రీస్, మాల్దీవులు వరకు విస్తరించింది. అంతర్జాతీయ సరిహద్దు నగదు బదిలీల్లో యూపీఐ తిరుగులేని శక్తిగా అవతరించింది.

వార్త సంధ్య

## సంపాదకీయం


# ఇరాన్‌పై ట్రంప్ ఆర్థిక యుద్ధం !



అమెరికా, ఇరాన్ యుద్ధంలో కొత్త అధ్యాయం మొదలయ్యింది. ఇరాన్‌ను ఆయుధాలతో దెబ్బతీయడం కుదరని పని అని అమెరికాకు తెలిసొచ్చింది. దీంతో ఇక ఆర్థిక యుద్ధం మొదలు పెట్టింది. దీంట్లోనూ ప్రపంచ దేశాలను లాగే యత్నం చేస్తోంది. ఇరాన్‌తో సంబంధాలు పెట్టుకునే దేశాలపైనా ఆంక్షలు కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయుధంతో పోరాటమైనా, ఆర్థిక పోరాటమైనా తన పంతమే నెగ్గాలన్నది ట్రంప్ వాదనగా ఉంది. నేను చెప్పినట్లు వినాలన్న ధోరణితో అమెరికా ఇప్పుడు ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేస్తోంది. ఈ క్రమంలో ఇరాన్‌పై మొన్నటి వరకు భౌతిక దాడులకు పాల్పడిన అమెరికా ఇప్పుడు రూటు మార్చింది. సరికొత్త ఆంక్షల పేరుతో టెహ్రాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెం ఇరాన్‌పై చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ప్రకటించారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌క్యాస్ట్' పేరుతో ఈ కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించారు. కాగా, ఇరాన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలపై ప్రభావం చూపుతున్నది. పెరిగిన చమురు ధరలు జీవన వ్యయంపై ఆందోళనలను పెంచాయి. పెట్రోల్,డీజిల్ ధరలు ఏడాది క్రితం కంటే చాలా ఎక్కువగా ఉండంతో అమెరికాతో పాటు అన్ని దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. మరో వైపు ఇరాన్‌పై ఆంక్షలను ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్వాగతించారు. ఇరాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. టెహ్రాన్‌పై ఇది ఒక 'ఆర్థిక డి–డే' లాంటిదని హెచ్చరించారు. డిజిటల్ ఆస్తులు, టెక్నాలజీ, బంగారం, విమానయానం, నౌకా రవాణా వంటి కీలక రంగాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఇతర దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీంతో పాటు ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న 60కి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో ఆర్థిక పోరులో ఇది చివరి అంకమని అమెరికా ప్రకటించింది. ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవాలని ప్రపంచ దేశాల నాయకులను కోరారు. మీరు మా వైపు ఉంటారా లేక మాకు వ్యతిరేకంగా ఉంటారా అని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న సుమారు 60 సంస్థలు, విదేశీ నౌకలపై అమెరికా నిఘా పెట్టింది. సహకరించే ఇతర దేశాలకూ ఆంక్షల భయం ఉంటుందని తెలిపారు. ఇరాన్‌తో ఆర్థికంగా భాగస్వామ్యం వహించే ఏ దేశమైనా ఏకాకిగా మిగిలిపోతుందని బెసెంట్ తెలిపారు. ఇరాన్‌పై కొన్నినెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్రరాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ పై అమెరికా ఆంక్షలు విధించడం కొత్తేం కాదు. ఇరాన్‌కు ప్రపంచంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు. అయితే యూఎస్ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తమ వాణిజ్య భాగస్వాములు గట్టిగా వ్యతిరేకిస్తారని టెహ్రాన్ విశ్వాసం వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఇతర దేశాలతో ఇరాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టే స్థితిలో అమెరికా లేదన్నారు. అమెరికన్ల ప్రగల్భాలను ఎవరూ నమ్మరు. అమెరికా ఆంక్షలప్రకటనను పరిగణనలోకి తీసుకోబోమని మా వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే మాకు సందేశాలు పంపారని పేర్కొన్నారు.యూఎస్ ప్రకటనపై ఇటు ఇరాన్ ప్రభుత్వం కూడా ఘాటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కొవడానికి మా వద్ద రెండేండ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార దాడులు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదనీజాదేహ్ మాట్లాడుతూ.. అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు మేం సర్వసన్నద్ధంగా ఉన్నాం. శత్రువులు మాపై ఆర్థిక ఉగ్రవాద దాడికి పాల్పడాలని చూస్తున్నారు. కానీ, మా వద్ద కూడా తగిన సాధనాలు ఉన్నాయి. ఇకపై మాది కేవలం రక్షణాళి కాదు, శత్రువులు మా దాడి కోసం ఎదురుచూడాలని హెచ్చరించారు. అమెరికా ఆంక్షలను చైనా, రష్యా అంగీకరిం చలేదని, ఇతర దేశాలు కూడా ప్రతిఘటిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహసెన్ రెజాయ్ మరింత ఘాటుగా స్పందించారు. అమెరికాకు సహకరించే ఏ దేశమైనా 'భూకంపం లాంటి' ప్రతీకారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పొరుగు దేశాలు సహకరిస్తే పర్షియన్ గల్ఫ్ లేదా హోర్ముజ్ జలసంధి నుంచి చుక్కనూనె కూడా బయటకు వెళ్లనివ్వబోమని తేల్చిచెప్పారు. మరోవైపు ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదానీజాదేహ్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు మరో ఓటమి తప్పదు. వాషింగ్టన్ విధించిన కొత్త ఆంక్షలను ఎదుర్కోవ డానికి మా వద్ద రెండేళ్ల ప్రణాళిక ఉంది. ఇరాన్ ప్రజలు, దేశ అధికారుల సంకల్పాన్ని పరీక్షించడానికి వారు చేయగలిగిందంతా చేశారు. కానీ ప్రతిసారీ విఫలమయ్యారని యూఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరిట 60 సంస్థలు, వ్యక్తులు, నౌకలపై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ సైనిక కార్యకలాపాలు, పెట్రోలియం, పెట్రోకెమికల్ వాణిజ్యంతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ వాటిని ప్రకటించింది.

# ఆర్థిక-సైనిక చిక్కుముడిలో అమెరికా

అమెరికా మధ్యంతర ఎన్నికలు ఇక ఎంతో దూరంలో లేవు. ఈ ఎన్నికలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అగ్నిపరీక్ష కానున్నాయి. ఈ సమయంలో ట్రంప్ విదేశాంగ విధానాల్లో విజయాల కంటే పరాజయాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆర్థిక రంగం లోనూ ఇదే పరిస్థితి. విజయాల కంటే వైఫల్యాలే ఎక్కువగా ఉన్నాయన్న విమర్శలు తీవ్రంగా వస్తున్నాయి. అధిక ధరలతో, ద్రవ్యోల్బణంతో ఇప్పటికే అమెరికా అల్లాడుతుండగా, టారిఫ్‌ల (సుంకాల) విషయంలో ట్రంప్ దూకుడుకు అమెరికా సుప్రీం కోర్టు కూడా ఇటీవల కొంతవరకు అడ్డుకట్ట వేసింది. రెండోసారి అధ్యక్షుడుగా ట్రంప్ పగ్గాలు చేపట్టిన తరువాత ప్రజాదరణ గత అధ్యక్షులతో పోలిస్తే తక్కువ స్థాయిలోనే ఉన్నట్టు తేటతెల్లమవుతోంది. దీంతో మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఓటమి పాలైతే తాను అభిశంసనకు గురై, చివరకు జైలుకెళ్లే ప్రమాదం రావచ్చున్న భయం ట్రంప్‌కు పట్టుకుంది. ఇప్పటికే అమెరికా చరిత్రలో రెండుసార్లు అభిశంసనకు గురైన ఏకైక అధ్యక్షుడు ట్రంప్‌నే. అయితే ఈ రెండు సందర్భాల్లోనూ సెనేట్‌లో ఆయన నిర్దోషిగా బయటపడడం విశేషం. అందువల్ల నవంబర్ ఎన్నికలు తనకు ఎలాంటి రాజకీయ ప్రమాదాలను తెచ్చిపెట్టగలవో ట్రంప్‌కు తన పార్టీ నేతల కంటే కూడా బాగా తెలుసు. అయితే ఇలాంటి ప్రతికూల పరిస్థితి పూర్తి స్థాయి రాజకీయ విపత్తుగా మారే అవకాశం మాత్రం తక్కువగానే కనిపిస్తోంది. సెనేట్‌లో ఎన్నికలకు వెళ్లే స్థానాల్లో ఎక్కువ భాగం రిపబ్లికన్లకు అనుకూలమైన 'రెడ్ స్టేట్స్'లో ఉండటంతో, ఆ పార్టీ స్వల్ప మెజారిటీని కొనసాగించే అవకాశం ఉంది. అయితే ప్రతినిధుల సభలో (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) రిపబ్లికన్లకు ఉన్న స్వల్ప మెజారిటీ మాత్రం కోల్పోయే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 2025 జనవరిలో రెండోసారి శ్వేతభవనం లోకి అడుగుపెట్టిన డొనాల్డ్ ట్రంప్ తాను ప్రపంచానికి శాంతి స్థాపకుడిగా వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు. కానీ గత 15 నెలల్లో ఆయన విదేశాంగ



విధానంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నారు. ముఖ్యంగా నోబెల్ శాంతి బహుమతిపై అత్యంత ఆసక్తి చూపించడం, తనకే ఆ బహుమతి రావాలని ప్రకటించడం వివాదాస్పదమైంది. గాజా యుద్ధానికి తానే ముగింపు పలికానని, భారత్‌పాకిస్థాన్ మధ్య సంఘర్షణలు యుద్ధంగా మారకుండా అడ్డుచక్రం వేశానని పదేపదే గొప్పలు చెప్పుకున్నారు. దీనిపై అంతర్జాతీయ స్థాయిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఏదేమైనా మధ్యంతర ఎన్నికలకు ముందు ట్రంప్ ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక విదేశాంగ సవాళ్లు రిపబ్లికన్ పార్టీకి కీలక పరీక్షగా మారనున్నాయి.తనకు తాను శాంతి స్థాపకుడిగా ప్రకటించుకున్న ట్రంప్ కోరి ఇరాన్‌తో యుద్ధానికి పాల్పడటం, అదీ తన మిత్రుడైన ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రోద్భలంతో యుద్ధాన్ని మరింత తీవ్ర స్థాయిలో కొనసాగిస్తుండడం ట్రంప్ చేస్తున్న ఘోరమైన అపరాధంగా ప్రపంచ దేశాలు ఎండగడుతున్నాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై , ఆ దేశం అణు ఇంధన శుద్ధి కేంద్రాలపై బాంబు దాడులు ప్రారంభించిన నాటినుంచి ఇరాన్ తీవ్రంగా ప్రతిఘటించడం ట్రంప్‌ను అయోమయానికి గురిచేస్తున్నాయి. అంతేకాకుండా హర్మ్యూజ్ జలసంధిద్వారా నౌకల రాకపోకలను అడ్డుకుంటామని ఇరాన్ హెచ్చరించడమే కాదు, అలా చేస్తుండడం ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభానికి దారితీసింది. కానీ హర్మ్యూజ్ జలసంధి తమ భూ భాగమన్న వాదనను ట్రంప్ గత ఆదివారం నుంచి తెరపైకి తీసుకు వచ్చారు. దీనికి ఇరాన్ తీవ్రంగా స్పందించి హర్మ్యూజ్ జలసంధి తమ అధీనంలోనే ఉందని నౌకల రాకపోకలు లేకుండా ఏనాడో తాము జలసంధిని మూసివేశామని ఇరాన్ ప్రకటించింది. ఈయుద్ధంలో అమెరికా విజయం సాధించలేకపోవడం కేవలం అమెరికా సైనిక రంగానికే పరిమితం కాలేదు. అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోడానికి దారితీస్తోంది. అమెరికా రక్షణ వ్యయాన్ని పెంచుతున్నాయి. యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే సైనిక పరికరాలు, సైనిక దళాల నిర్వహణ, ఆయుధాలు, మిత్రదేశాలకు సహాయం వంటి ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉంది. బాండ్ మార్కెట్‌లో వడ్డీ రాబడులు వేగంగా పెరగడంతో ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సివస్తోంది. ఇదే సమయంలో అమెరికా స్థూల జాతీయ రుణం తొలిసారిగా ఈ ఆగస్టులో 40 ట్రిలియన్ డాలర్లను దాటింది. ఈ రుణాన్ని సెకనుకు ఒక డాలర్ చొప్పున తీర్చాలంటే ఒక మిలియన్ సంవత్సరాలకు పైగా పడుతుంది. అయితే దాన్ని అలా పూర్తిగా తీర్చాలని ఎవరూ భావించడం లేదు.

# ప్రపంచ ఫ్యాక్టరీగా చైనా మరింత ముందుకు!

ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగరవేసిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ చేసిన ఉపన్యాసంలో మేడిన్ ఇండియా ( భారత తయారీ) వస్తువులు ప్రపంచంలో ప్రతి మూలకూ చేర్చటం లక్ష్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. "ఉన్నమాట అన్నా వు ఎవ్వరు నేర్పిన మాటరా వేదంలా విలువైన మాట" అనే సినిమా పాటను గుర్తుచేశారు. పాడిందే పాడరా అన్నట్లుగా ఇలాంటి మాటలు ఎన్నిసార్లు చెబుతారు, దేశాన్ని ఎటువైపు తీసుకుపోతు న్నారన్నదే అసలైన సమస్య. ప్రధానిగా తొలి ఆగస్టు పదిహేను అంటే 2014 ప్రసంగంలో మేకిన్ ఇండియా(భారత్‌లో తయారీ) పిలుపునిచ్చారు. "రండి, భారత్‌లో తయారు చేయండి, ప్రపంచంలో వాటిని ఏ దేశంలోనైనా విక్రయిం చండి, కానీ వాటిని భారత్‌లోనే ఉత్పత్తి చేయాలి" అని విదేశీ పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు పిలుపునిచ్చారు. అదే ఏడాది సెప్టెంబరు 25న న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఏడాదీ ఏదో ఒక సందర్భంగా ఇలాంటి పిలుపులిస్తూనే ఉన్నారు. కనుచూపు మేరలో కూడా ఎక్కడా అలాంటి పరిస్థితి కనిపిం చటం లేదు, అయినా పదే పదే చెబుతున్నారంటే దాన్నే మనాలి? భారత తయారీ సప్తధారల్లో జరగాలని మోడీ చెప్పారు. చెప్పిన మాట చెప్పకుండా తన కార్యాలయం రాసిచ్చిన ఉపన్యాసాలను కొత్త కొత్త పదజాలంతో కాశీ మజిలీ కథల మాదిరి ఊకదంపుడుతో కొత్తవాటిని చెప్పటం తప్ప అడుగు ముందుకు పడటం లేదు. డ్రోన్ వ్యవస్థలను మనం అభివద్ధి చేయాలని, హైపర్‌సోనిక్ రక్షణ సాంకేతిక రంగంలో ప్రపంచ నాయకత్వాన్ని చేపట్టాలని కూడా చెప్పారు. పన్నెండేండ్లుగా ఎవరు వద్దన్నారు. ఇప్పటికే మనకంటే ఎంతో ముందున్న దేశాలు ఈ రంగాల్లో ఇంకా ముందుకు పోతాయి. అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్నట్లు దేశాన్ని తయారు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. పోటీతత్వం లేకపోతే వర్తమానంలో ఏ దేశమూ పరుగులో నిలవలేదు. అందుకు అవసరమైనట్లుగా పని చేశామా లేదా అన్నదే ముఖ్యం. స్విడ్జర్లాండ్‌లోని లాసానే నగరంలో 1990లో ఐఎండి బిజినెస్ స్కూలు ఉంది. దాన్నొక ప్రతిష్టాత్మక సంస్థగా పరిగణిస్తున్నారు. ప్రతి ఏటా దేశాలను ఎంచుకొని పోటీతత్వ సూచికలను ప్రకటిస్తుంటుంది. తాజా 2026 నివేదిక ప్రకారం మన దేశం 44వ ర్యాంకులో ఉంటే చైనా పన్నెండవదిగా ఉంది. ప్రధాని చెబుతున్నట్లుగా 2047 నాటికి లేదా అంతకు ముందే మనదేశం చైనాను వెనక్కు నెట్టి ప్రపంచ ఫ్యాక్టరీగా మారుతుందా? మోడీ చెప్పినట్లు మన వస్తువులన్నీ ప్రపంచంలో అన్ని మూలలకు ఎగుమతి అవుతాయా? మాటలు కోటలు దాటటం తప్ప చేతలు గడపదాటటం లేదనే లోకోక్తి తెలిసిందే. ఇతర దేశాలతో పోటీ పడకపోవటానికి కాంగ్రెస్, నెహ్రూ, గాంధీ కారణమని కాషాయ దళాలు చెబుతుంటాయి. 2014 నుంచి అధికారం లో ఉన్న మోడీ ఏం చేశారన్నదే ప్రశ్న. తొలిసారిగా ఎర్రకోటపై మోడీ జాతీయ జెండా ఎగురవేసినపుడు ఐఎండి నివేదిక ప్రకారం భారత్ 2013లో 40వదిగా, చైనా 21వ స్థానంలో ఉంది. పైన చెప్పుకున్నట్లు తాజా సూచికల ప్రకారం 44–12 స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచమంతటా తిరిగి యుపీఏ హయాంలో కోల్పోయిన దేశ ప్రతిష్టను తిరిగి తీసుకువచ్చా నని చెప్పిన తరువాత పరిస్థితి ఇది. చైనా ఎలా పెంచుకుందో, మనం ఎలా దిగజారామో దానికి



కారకులు ఎవరో ఎవరిని అడిగినా చెబుతారు. 'బుద్దులు భూములను ఏలుతుంటే రాతలు గాడిదలను కాస్తున్నాయనే' లోకోక్తిని ఇక్కడ గుర్తు చేయకతప్పటం లేదు. మోడీ అధికారానికి వచ్చినపుడు కమ్యూనిస్టు చైనా నుంచి మనం 6,040 కోట్ల డాలర్ల మేర వస్తువులను దిగుమతి చేసుకున్నాం, 2026 మార్చినెల నాటికి 13,160 కోట్ల డాలర్లకు పెరిగాయి, ఇదే సమయంలో చైనాతో వాణిజ్యలోటు 3,600–4,000 కోట్ల మధ్య ఉన్నది 11,200 కోట్లకు పెరిగింది. వర్తమాన సంవత్సరంలో దిగుమతులు, వాణిజ్యలోటు మరింతగా పెరగనున్నట్లు చెబుతున్నారు. బీజేపీ నేతలు చైనా నుంచి మనం సెల్‌ఫోన్ల దిగుమతులను తగ్గించాం చూశారా మోడీ ఘనత అంటూ అడ్డుసవాళ్లు విసురుతారు. ఎలక్ట్రానిక్స్ రంగం లో పెద్ద మొత్తంలో కేంద్ర ప్రభుత్వం రాయితీ లిస్తున్నది గనుక అనేక కంపెనీలు మనదేశం లోనే ఫోన్లు తయారు చేస్తున్నందున దిగుమతు లు తగ్గినమాట నిజం, కానీ మొత్తంగా దిగుమతులు ఎందుకు పెరుగుతున్నట్లు ? మన వాణిజ్యలోటు పెరగటం అంటే ఏటా మనం చైనాకు అప్పనంగా అంత మొత్తాలను చెల్లిస్తున్నాం. ఎందుకీ పరిస్థితి ? ప్రపంచ సరఫరా గొలుసులో మనం కూడా ఒక భాగంగా ఉండాలని, వస్తువులను ఎగుమతి చేయాలని నిటి ఆయోగ్ నివేదికలు ఎప్పటికపుడు చెబుతూనే ఉన్నాయి. ఇదిగో ఫలానా రంగంలో అవకాశం ఉందని గుర్తు చేస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి వంద సంవత్సరాలు పూర్తి చేసుకొనే 2047 నాటికి లక్ష్యాలను చేరాలంటే మొత్తం 62 అంశాల జాబితాను రూపొందించి వాటిలో 12 రంగాలను గుర్తించినట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఇన్నేండ్ల నుంచి ఎందుకు విఫలమ య్యామనే అంశాన్ని మోడీ ఎప్పుడైనా చెప్పారా? ఈ రంగాల్లోకి అత్యధికంగా ప్రయివేటు పెట్టు బడులు వస్తేనే లక్ష్యాన్ని సాధించగలమని నిటిఆయోగ్ ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ లాహిరి చెప్పారు. మోడీ అధికారానికి వచ్చినపుడు 2014లో జీడీపీలో 25–26 శాతం ప్రయివేటురంగ పెట్టు బడులు ఉండేవి, ఇటీవల 22 శాతానికి తగ్గాయి, అదీ కార్పొరేట్ పన్ను తగ్గింపు, ఇతర రాయితీలిచ్చినప్పటికీ పెరగకపోగా తగ్గాయి. దేశంలో ఉన్న ప్రయివేటు రంగమే ముందుకు రాకపోతే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ) ఎలా వస్తాయి? 2047 నాటికి దేశ జీడీపీని 30లక్షల కోట్లకు చేరుస్తామని చెబుతున్నారు. అందుకు గాను వచ్చే 20ఏండ్లు ఏటా పదిశాతంపైగా వాస్తవ వృద్ధి రేటు ఉండాలని ఆర్థికవేత్తలు చెబు తున్నారు. దానికి ప్రాతిపదిక ఉందా? అలా జరిగితే ఇలా జరిగితే లక్ష్యాలను సాధించటం కష్టమేమీ కాదని చెప్పేవారు కోకొల్లలు... తనదిగాకపోతే కాశీ వరకు తాటిపట్ట మీద దేకవచ్చాన్నడట వెనుకటికి ఎవడో. ప్రపంచ బ్యాంకు తాజా సమాచారం ప్రకారం ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో చైనా వాటా 28శాతం కాగా మనం ప్రపంచంలో ఐదవ ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకుంటున్నప్పటికీ మన వాటా మూడు శాతం దగ్గరే ఉంది. 2004లో చైనా వాటా పదిశాతం లోపుగానే ఉంది. విలువలో 625 బిలియన్ డాలర్ల నుంచి ప్రస్తుతం 4.66లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇక అమెరికా విషయానికి వస్తే ఇదే కాలలో 22శాతం నుంచి 17కు, ఐరోపా ప్రాంత వాటా తగ్గి 15శాతానికి పరిమితం కాగా జపాన్ ఐదుశాతం కలిగి ఉంది.ఇదే సమయంలో మన వాటా 1.6–1.8శాతం మధ్య ఉంది, అది 2014నాటికి రెండు శాతానికి చేరింది. మోడీ ఏలుబడిలో ఇప్పటివరకు మూడుశాతానికి పెరిగింది. అమెరికా, జపాన్, జర్మనీ మూడింటి కంటే ఎక్కువగా చైనా ఉత్పత్తి ఉంది. ఆశలు, ఊహలు, అడుక్కొనే విషయాల్లో పిసినారితనం ఉండకూ డదంటారు పెద్దలు.ఇలాంటి స్థితిలో ప్రపంచ కేంద్రంగా మనదేశాన్ని మారుస్తానని, మోడీ, ఆయన భజన బృందం లోని ఆకాశానికి నిచ్చెనలు వేసే చంద్రబాబు వంటి వారు చెబితే నమ్మేదెలా ? పెద్ద మొత్తంలో రాయితీలు ఇస్తే కొన్ని రంగాల్లో పురోగతి ఉండవచ్చు కానీ మా ఊర్లో మిరియాలు తాటికాయలంత అంటే జనం చెవుల్లో పూలు పెట్టటమే. కరోనా సమయంలో చైనాలోని కంపెనీలన్ని అక్కడి నుంచి దుకాణాలు ఎత్తేసి భారత్‌కు వస్తున్నట్లు చెప్పిన వారు ఇప్పుడు ఎక్కడా చప్పుడు చేయటం లేదు. ఉత్పాదక రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తే దిగుమతులపై ఆధార పడాల్సిన పనిలేదు, ఉద్యోగ సృష్టి జరుగుతుంది. అమెరికా అంత అగ్రరాజ్యమే మా దేశంలో పెట్టుబడులు పెడతారా లేక మీ సంగతి చూడమంటారా అని బెదిరింపులకు దిగటం వెనుక పరమార్ధం ఇదే. చైనా ఇప్పుడు విలువ ఆధారిత ఉత్పత్తుల మీద కేంద్రీకరిస్తోంది, అది కేంద్రీకరణ తగ్గించిన రంగాల్లో మనం బలపడవచ్చని నిటి ఆయోగ్ నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో చైనా వాటా 2000 సంవత్సరంలో ఆరుశాతమే, 2030 నాటికి 45శాతానికి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత అమెరికా తదితర ధనిక దేశాలు 1948లో సోవియట్ యూనియన్, చైనా లేకుండా 23 స్థాపక దేశాలతో జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్ అండ్ ట్రేడ్(గాట్–పన్నులు మరియు వాణిజ్యంపై సాధారణ ఒప్పందం) జరిగింది. దీనిలో భారత్, పాకిస్తాన్ ఉన్నాయి. అది 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థగా మారింది. అయినప్పటికీ 2001 వరకు చైనాను దానిలో చేరకుండా అడ్డుకున్నారు.అది ప్రపంచ ఫ్యాక్టరీగా మారుతూ చౌకగా అనేక ఉత్పత్తులను అందచేస్తున్న క్రమంలో తమ ప్రయోజనాల కోసం అడ్డుకున్నదేశాలే సభ్యత్వం ఇవ్వక తప్పలేదు. ఆ తరువాత బీజింగ్ వెనుదిరిగి చూడలేదు, ఎగుమతుల అవకాశాలు మరింతగా పెరిగాయి. నవీకరణతో పాటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులూ వచ్చాయి. మేడిన్ చైనా 2025 వంటి లక్ష్యాలు, అందుకు అవసరమైన విధానాలతో ముందుకు పోవటమే గాక అవసరమైన కార్మికశక్తి నైపుణ్యాల ను కూడా పెంచింది.

# సంతాన సాఫల్యం-ఆధునిక చికిత్స'పై వైద్య సదస్సు



**ఖమ్మం, :ఆగస్టు -25:(వార్త సంధ్య )**
ఒయాసిస్ ఫెర్టిలిటీ, ఐఎంఏ ఖమ్మం, ఫాగ్సీ ఖమ్మం ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన సంతాన సాఫల్య వైద్య సదస్సుకు 160 మందికి పైగా వైద్యులు హాజరయ్యారు. సంతాన సాఫల్య చికిత్స, పునరుత్పత్తి వైద్యంలో తాజా పరిణామాలు, ఆధునిక చికిత్స విధానాలపై నిపుణులు చర్చించారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ ఖమ్మం సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు డాక్టర్ శిరీష కరుపోతుల, శాస్త్రీయ విభాగాధిపతి డాక్టర్ కృష్ణ చైతన్య, ప్రాంతీయ వైద్య విభాగాధిపతి డాక్టర్ జలగం కావ్యరావు పలు అంశాలపై ప్రసంగించారు. పురుషుల సంతాన సాఫల్య సామర్థ్య అంచనా, శరీరం వెలుపల అండాల పరిపక్వత, సకాలంలో చికిత్స, వీర్యకణాల సిద్ధం, పిండాల అభివృద్ధి తదితర అంశాలపై శాస్త్రీయ చర్చలు, ప్రత్యక్ష శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ఖమ్మం అధ్యక్షురాలు డాక్టర్ రెహానా బేగం, కార్యదర్శి డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు, కోశాధికారి డాక్టర్ కురపాటి ప్రీతి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎన్నికైన సభ్యుడు డాక్టర్ కుసుమరాజు రవికుమార్, ఖమ్మం ప్రసూతి, స్త్రీ వైద్య సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సురేఖ రావులపల్లి, కార్యదర్శి డాక్టర్ లోకం గీత, కోశాధికారి డాక్టర్ బి.ఎస్.వి.పద్మావతి పాల్గొన్నారు.

## పన్నూర్‌లో ఘనంగా వనమహోత్సవం

**- మాస్ ప్లాంటేషన్**



**రామగిరి,,:ఆగస్టు -25:(వార్త సంధ్య )**
మంగళవారం రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పర్యావరణ పరిరక్షణ కోసం వనమహోత్సవం (మాస్ ప్లాంటేషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు.సర్పంచ్ చిందం మహేష్ ఆధ్వర్యంలో,రామగిరి మండలం ఎంపీడీఓ బి.శైలజ రాణి భాగస్వామ్యంతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన, స్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.మొక్కలు నాటడం ద్వారా పాఠశాల ఆవరణ మరింత పచ్చదనంతో,ఆహ్లాదకరమైన వాతావరణంగా మారనుంది.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమలత,ఉప సర్పంచ్ కావేటి మల్లేశ్వరి,వార్డు సభ్యులు చేతి సుధాకర్,విజయ్ ప్రదీప్,కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్,విద్యార్థులు,పన్నూర్ గ్రామపంచాయతీ సిబ్బంది,ఏ ఎన్ ఎమ్ లు,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల ఆహ్వానం

**రామగిరి,,**
**:ఆగస్టు -25:(వార్త సంధ్య )**



2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల సింగరేణి సేవా సమితి అధ్వర్యంలో నిర్వహించనున్న టైలరింగ్, మగ్గంవర్క్స్, స్పోకెన్ ఇంగ్లీష్, జూట్ బ్యాగ్స్ తయారీ మొదలగు నైపుణ్యాభివృద్ధి కోర్సుల శిక్షకురాలుగా నేర్పించుటకు ఆసక్తి, అర్హత, అనుభవం గల సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు, పరిసర గ్రామాల మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తుతో పాటు సంబంధిత విభాగంలో అనుభవ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జతచేసి రామగుండం-3 ఏరియా జీ.ఎం.కార్యాలయంలోని పర్సనల్ విభాగం నందు తేది: 05-09-2026. సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని కోరారు.ఇతర పూర్తి వివరాలకై ఏరియా పర్సనల్ విభాగం నందు సంప్రదించాలని తెలిపారు.

## రీ-సర్వే పకడ్బందీగా ని ర్వహించాలి

**-కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**/జగిత్యాల ,:ఆగస్టు -25:(వార్త సంధ్య )**
రీ-సర్వేను అత్యంత పార దర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసా ద్ అధికారులను ఆదేశిం చారు. జగిత్యాల జిల్లా కలె క్టరేట్ లొ మంగళవారం త హసీల్దార్లు, గిర్దావర్లు, గ్రామ పాలనాధికారులకు శిక్షణ ఇ చ్చారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ, అటవీ భూము లు, చెరువులు, కుంటలు, రహదారులను గుర్తించి రి కార్డు చేయాలన్నారు. పాత భూ రికార్డులను పరిశీలించి రికార్డులురూపొందించాలని సూచించారు. భూ యజ మానులకు నోటీసులిచ్చి హ ద్దులు నిర్ధారించాలని అ న్నారు.

# కేబుల్ ఛానళ్ళ సమస్యలు పరిష్కరించండి

**-ఐపీ టీవీలకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి**
**-మీడియా అకాడమీ ఛైర్మెన్ కు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి**

**హైదరాబాద్, ,:ఆగస్టు -25:(వార్త సంధ్య )**
రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నాయకత్వంలో పలువురు కేబుల్ ఛానళ్ళ నిర్వహకులు, ఫెడరేషన్ నాయకులు సోమవారం తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డిని కలిసి కేబుల్ ఛానళ్ళ అక్రెడిటేషన్ కార్డుల సమస్య పై చర్చించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ళుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో కేబుల్ నెట్వర్క్ ద్వారా నడుస్తున్న కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, దీనివల్ల ఆయా ఛానళ్ళలో పని చేస్తున్న జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఎంతోమంది సీనియర్ జర్నలిస్టులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి కొన్నేళ్ళుగా నడుపుతున్న కేబుల్ న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో అన్యాయం చేయడం తగదని, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం లేకపోయినప్పటికీ జర్నలిజం పట్ల వారికున్న మక్కువతో కష్ట నష్టాలకోడ్చి నడుపుతున్న కేబుల్ ఛానళ్ళకు ప్రభుత్వం ఇచ్చే ఏకైక అక్రెడిటేషన్లు కూడా సరిగా ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో చాలా కేబుల్ నెట్వర్క్ సంస్థలు కొత్త టెక్నాలజీతో ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) నెట్వర్క్ ద్వారా న్యూస్ ఛానళ్ళను నడుస్తున్నాయని, సీనియారిటీ ఉన్న ప్రతి కేబుల్ ఛానల్ తో పాటు అన్ని అర్హతలున్న కొత్త ఛానళ్ళకు, ఐపీ ఆధారిత న్యూస్ ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య



కోరారు.కేబుల్ ఛానళ్ళ సంఖ్య, జర్నలిస్టుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కేబుల్ చానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు తగ్గించకుండా,కనీసం గతంలో ఇచ్చిన మాదిరిగా, జిల్లాకు 4, రాష్ట్ర స్థాయిలో 12 కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి అన్నారు. ఇప్పటికే అన్ని అర్హతలతో అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న కేబుల్ ఛానళ్ళకు వెంటనే కార్డులు ఇవ్వాలని, ఐపీ నెట్వర్క్ లో నడుస్తున్న న్యూస్ ఛానళ్ళను కూడా గుర్తించి అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అనంతరం వారు ఛైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్ ఎస్. రవికుమార్, జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, వెంకట్, కుమారస్వామి, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గుత్తిలో ప్రపంచ పర్యాటక దినోత్సవ పోస్టర్ల విడుదల

**గుత్తి (గుంతకల్లు), :ఆగస్టు -25:(వార్త సంధ్య )**
ఈనెల 27వ తేదీ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గుత్తిలో గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. గుత్తి మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా చేతులమీదుగా ఈ పోస్టర్లను విడుదల చేశారు. అలాగే ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని చారిత్రక నేపథ్యం కలిగిన గుత్తి కోట ప్రాశస్తం గురించి రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, గేయాలు, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నామని గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయభాస్కర్ చౌదరి పేర్కొన్నారు. ప్రతి ఏటా ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాలను గుత్తిలో ఘనంగా నిర్వహిస్తుండడం ఆనవాయితీగా మారిందన్నారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా మాట్లాడుతూ గుత్తి కోట దేశంలోని ప్రముఖ గిరిదుర్గాలలో ఒకటిగా...



కొండపై నిర్మించబడిన అద్భుతమైన చారిత్రక కోటగా వెలుగొందుతోందన్నారు. అనేక రాజ వంశస్థుల ప్రస్తానానికి గుత్తి కోట సజీవ సాక్షంగా నిలిచిందన్నారు. గుత్తి కోట వేదికగా ప్రభుత్వ పరంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరిగాయన్నారు.

అలాగే గతంలో ఎన్నడూ వినీ ఎరుగని రీతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గుత్తి కోట ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం మేనేజర్ పులిచెర్ల రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్ రెడ్డి,గుత్తికొండ సంరక్షణ సమితి ఉపాధ్యక్షులు సుధాకర్ నాయుడు, గౌరవ సలహాదారు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఏ.వి. సుధాకర్ బాబు, గుత్తి కోట సంరక్షణ సమితి యువజన కన్వీనర్ హెచ్. ఎం జిలాన్, అక్షయ సేవా ట్రస్ట్ ఛైర్మన్, కందుల హేమలత, సామాజిక సేవా కార్యకర్తలు ఆదినారాయణ, మాణిక్యం, మున్సిపల్ సిబ్బంది, గుత్తికొండ సంరక్షణ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత' పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ

**పరిగి ,:ఆగస్టు -25:(వార్త సంధ్య )**




పరిగి పురపాలక సంఘం పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల నుంచి నూతన 'చేయూత' పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు మున్సిపల్ కమిషనర్ మరియు ఛైర్‌పర్సన్ ఒ ప్రకటనలో తెలిపారు. కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోదలచిన వారు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నేరుగా తమ దరఖాస్తులను ఆగస్టు 31 లోపు అందజేయవచ్చు. అని తెలిపారు చివరి తేదీ వరకు వేచి చూడకుండా, అర్హులైన పేదలు, వృద్ధులు, వికలాంగులు మరియు ఇతర అర్హత కలిగిన లబ్ధిదారులు వీలైనంత త్వరగా అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# నేడు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం: ఎస్ఐ వినోద్‌కుమార్

**చిట్వేల్, ,:ఆగస్టు -25:(వార్త సంధ్య )**



వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలు, నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేందుకు చిట్వేల్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నారు. రేణిగుంట డీఎస్పీ, కోడూరు రూరల్ సీఐ సూచనల మేరకు చిట్వేల్ ఎస్ఐ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో 26వ తేదీ సాయంత్రం 4 గంటలకు చిట్వేల్ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం జరుగుతుందని తెలిపారు. విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపు, నిమజ్జనం, ట్రాఫిక్ నియంత్రణ, శబ్ద కాలుష్యం, విద్యుత్, అగ్ని ప్రమాదాల నివారణతో పాటు భక్తులు, ప్రజల భద్రతపై కమిటీ సభ్యులకు సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. చిట్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశానికి హాజరై పోలీసుల సూచనలు పాటిస్తూ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఎస్ఐ వినోద్‌కుమార్ కోరారు.

# హరితహారానికి పెద్దవంగర పునఃప్రతిజ్ఞ

**వనమహోత్సవంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి మొక్కలు నాటి పచ్చదనానికి శ్రీకారం**

**పెద్దవంగర, ,:ఆగస్టు -25:(వార్త సంధ్య )**
పెద్దవంగర గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పచ్చని గ్రామ నిర్మాణమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు కలిసి మొక్కలు నాటి హరితహారానికి తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్, ఎంపీడీవో సురేష్, ఏవో స్వామి, పంచాయతీ కార్యదర్శి వెంకన్న, టీఏ సురేష్, వార్డు సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని



వనమహోత్సవాన్ని విజయవంతం చేశారు. పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు.

## మధ్యప్రదేశ్‌లో వింతశిశువు జననం..

**-నాలుగు కాళ్లు, నాలుగు చేతులు..!**



న్యూఢిల్లీ ఆగస్టు -25:(వార్త సంధ్య )
మధ్యప్రదేశ్ లో ఒక అరుదైన వైద్య పరిణామం చోటుచేసుకుంది. లవ్‌కుష్‌నగర్ లో ఓ మగ శిశువు నాలుగు కాళ్లు, నాలుగు చేతులతో జన్మించాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆ శిశువును చూసేందుకు భారీగా తరలివచ్చారు. వైద్యుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. శిశువు ఛాతీ భాగం నుంచి ఈ అదనపు అవయవాలు పెరిగినట్లు గుర్తించారు.ఈ అసాధారణ పరిస్థితికి జన్యుపరమైన లోపాలు కారణం కావొచ్చని వైద్యులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అదనంగా ఉన్న కాళ్లు, చేతులను శస్త్రచికిత్స ద్వారా తొలగించే అవకాశాలను వారు పరిశీలిస్తున్నారు. అయితే సర్జరీకి ముందు ఆ అవయవాల్లోని రక్త ప్రసరణ వ్యవస్థ, ఎముకల అనుసంధానం వంటి కీలక అంశాలను నిర్ధారించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం శిశువుకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నివేదికలు వచ్చిన తర్వాతే శస్త్రచికిత్సపై తుది నిర్ణయం తీసుకుంటామని వైద్యులు స్పష్టం చేశారు. ఇదిలావుండగా శిశువుకు మెరుగైన వైద్యం అందించేందుకు అధికారులు తక్షణమే స్పందించారు. బాలుడిని ఎయిర్ అంబులెన్స్ ద్వారా జబల్‌పూర్‌లోని ప్రత్యేక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిపుణులైన వైద్యుల బృందం శిశువు ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది.

## పైలట్లకు ప్రతి ఏడాది డోప్ టెస్టులు..

**- ఎయిరిండియా విమాన ఘటన నేపథ్యంలో నిర్ణయం**




న్యూఢిల్లీ ఆగస్టు -25:(వార్త సంధ్య )
ఇకపై పైలట్లకు ప్రతి ఏడాది డోప్ టెస్టులు నిర్వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ విషయాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం వెల్లడించారు. ప్రస్తుతం ఈ అంశంపై డీజీసీఏ (ద డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) దృష్టి సారించిందని, దీనికి సంబంధించి ఇప్పటికే ఉన్న నిబంధనల్ని పరిశీలిస్తోందని మంత్రి అన్నారు.అలాగే, కొత్త నిబంధనల రూపకల్పనపై దృష్టి సారించిందని తెలిపారు. ఇటీవల ఎయిరిండియా విమానం గాలిలో ఉండగా, కుదుపులకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. దీనికి గల కారణాలపై విచారించగా.. పైలట్ గంజాయి సేవించినట్లు తేలింది. పైలట్లు మత్తులో ఉండటం వల్ల విమాన ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఉంటుంది. అందువల్ల పైలట్లు ఇలా నిషేధిత డ్రగ్స్ తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని, అలాంటి వారిని గుర్తించేందుకు డోప్ టెస్టులు నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది. నిజానికి దీనికి సంబంధించి ఎప్పటినుంచో ఈ రూల్ ఉంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. పైలట్లలో 10 శాతం మందికి మాత్రమే ప్రతి ఏడాది డోప్ టెస్టులు నిర్వహించాలి. అయితే, ఇకపై ప్రతి పైలట్‌కు ఏడాదికోసారి తప్పనిసరిగా డోప్ టెస్ట్ నిర్వహించాలని భావిస్తోంది. అంటే, 100 శాతం మంది పైలట్లకు డోప్ టెస్టు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. భద్రత, నిర్వహణపరమైన అంశాల్ని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు.

## కారుపై 3400 కిస్సులు ఇచ్చిన గర్ల్‌ఫ్రెండ్..

**-5500 ఫైన్ కట్టిన ప్రియుడు**



న్యూఢిల్లీ ఆగస్టు -25:(వార్త సంధ్య )
ముద్దులతో ముంచెత్తింది ఓ అమ్మాయి. కానీ ఆ ముద్దులన్నీ తన బాయ్‌ఫ్రెండ్ కారుకు ఇచ్చింది. కారు నిండా సుమారు 3400 లిప్‌స్టిక్ మార్కులు పడ్డాయి. అయితే రెండు రోజుల నుంచి గ్వాలియర్ వీధుల్లో ఆ కార్లు చక్కర్లు కొట్టింది. ఆ కారు వీడియో వైరల్ కావడంతో .. ఇక ట్రాఫిక్ పోలీసులు పంజా విసిరారు. ఆ కారుకు 5500 జరిమానా విధించారు. ఇంకా ఆ కారుపై ఉన్న లిప్‌స్టిక్ మార్క్‌లను తొలగించాలని కూడా ఆదేశించారు. స్టోరీలోకి వెళ్తే ..తన ప్రియుడికి ఓ ప్రియురాలు ప్రేమను చాలా గాఢంగా వ్యక్తం చేసింది. సోషల్ మీడియా స్టంట్ కోసం ఆమె తన బాయ్‌ఫ్రెండ్ కారుకు ఏకంగా వేల సంఖ్యలో కిస్సులు ఇచ్చింది. ఆ కారుపై 3400 లిప్‌స్టిక్ మార్కులు పడ్డాయి. అయితే కారు వీడియో వైరల్ కావడంతో పోలీసులు దాని గురించి ఆరా తీశారు. కారును మాడిఫై చేసినందుకు దాని ఓనర్‌కు ఫైన్ వేశారు. లిప్‌స్టిక్ ముద్రలతో సిటీ సెంటర్‌లో తిరుగుతున్న కారును గుర్తించినట్లు ట్రాఫిక్ పోలీసు ఇన్‌స్పెక్టర్ అభిషేక్ రఘువంశీ తెలిపారు. ఆ కారు తాటిపూర్ ఏరియాకు చెందినట్లు పేర్కొన్నారు. కారు డ్రైవర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. మోటారు వెహికిల్స్ యాక్టు ప్రకారం 5500 ఫైన్ వేశారు. ఇక ఆ కారుపై ఉన్న లిప్‌స్టిక్ ముద్రలను అతనితోనే తూడిపించారు. ఫారిన్ ట్రెండ్‌ను ఫాలోఅవుతున్న తన గర్ల్‌ఫ్రెండ్ ఇలా ఆ కారును తనకు గిఫ్ట్‌గా ఇచ్చినట్లు కారు ఓనర్ ఆదిత్య సికావార్ తెలిపారు. ఇక ఆ కారుపై కిస్సులు పెట్టేందుకు ఆ అమ్మాయికి సుమారు మూడున్నర గంటల సమయం పట్టిందట. కారుపై3400 కిస్సులు పెట్టిన తర్వాత ఆ వీడియోను ఆమె సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసింది. కారును అలా అలంకరించడం అక్రమం అని తనకు తెలియదని, లిప్‌స్టిక్‌ను తుడిచివేసేందుకు కారును మొత్తం క్లీన్ చేయాల్సి వచ్చిందన్నాడు. ఫైన్ కూడా కట్టేసినట్లు ఓనర్ చెప్పాడు. చట్టాన్ని ఉల్లంఘించి ఇలాంటి పనులు చేయవద్దు అన్నాడు.

# నితిన్ గడ్కరీ రాజకీయాల నుంచి రిటైర్ అవుతున్నారా..?

**-ఆయన వ్యాఖ్యలకు అర్థమేంటి**



న్యూఢిల్లీ ఆగస్టు -25:(వార్త సంధ్య )
కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రిటైర్ అవ్వబోతున్నారా..? తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు అందుకు సంకేతమేనా అనే చర్చ జరుగుతోంది. దీనిపై ఆయన కార్యాలయం స్పందించి, స్పష్టతనిచ్చింది. రాజకీయాల నుంచి రిటైర్ అవ్వాలనుకుంటున్నారనే ప్రచారంలో నిజం లేదని వెల్లడించింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గత ఆదివారం, ఆగష్టు 23న తన సొంత ప్రాంతమైన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు.ఇది లక్ష్మణ్‌రావ్ మన్కర్ ట్రస్ట్‌కు సంబంధించిన కార్యక్రమం. ఈ ట్రస్టును గడ్కరీ స్థాపించారు. ఇది ఎకాల్ విద్యాలయాస్ పేరుతో గిరిజన ప్రాంతాల్లో విద్యాసంస్థల్ని నిర్వహిస్తుంటుంది. ఈ ట్రస్టుకు సంబంధించిన కార్యక్రమంలో నితిన్ గడ్కరీ మాట్లాడారు. "నేను ఎంతో కాలం పని చేయలేను. కాబట్టి, యువతకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాల్సిందిగా కోరుతున్నా. ఇప్పుడు చాలా మంది యువత ఉన్నారు. పెద్దవారు వారికి మార్గనిర్దేశకత్వం చేస్తున్నారు" అంటూ వ్యాఖ్యానించారు. తాను ఎక్కువ కాలం పని చేయలేనని, కొత్త వారికి అవకాశాలు ఇవ్వాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. రాజకీయాల నుంచి నితిన్ గడ్కరీ తప్పుకోవాలి అనుకుంటున్నారని, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారని, మంత్రి పదవి నుంచి తప్పుకొంటారని ప్రచారం మొదలైంది. పైగా.. త్వరలో మోదీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయే ప్రభుత్వంలో మంత్రివర్గంలో జరగనుందనే ప్రచారం కూడా తోడైంది. దీంతో కొత్త మంత్రివర్గంలో గడ్కరీకి చోటు ఉండకపోవచ్చని ప్రచారం జరిగింది. అయితే, ఈ అంశంపై ఇప్పుడు గడ్కరీ కార్యాలయం స్పందించింది. ఆయన రాజకీయాల నుంచి తప్పుకొంటారు అనే ప్రచారంలో నిజం లేదని వెల్లడించింది. గడ్కరీ చేసిన వ్యాఖ్యలు ఆయన ట్రస్టుకు వర్తిస్తాయని, రాజకీయాలకు కాదని పేర్కొంది. తన ట్రస్టు వ్యవహార్ని యువతకు ఇవ్వాలనుకుంటున్నారని స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రచారానికి తెరపడినట్లైంది.

# దేశంలో పెరిగిపోతున్న ఉల్లి ధరలు..

**ఇప్పటికే భారమైన చక్కెర..**
**సామాన్యుడి ఇక్కట్లు**



న్యూఢిల్లీ ఆగస్టు -25:(వార్త సంధ్య )
దేశంలో ఇటీవలి కాలంలో ఉల్లి ధరలు పెరిగిపోతున్నాయి. దీంతో సామాన్యుడిపై ఆర్థిక భారం పెరుగుతోంది. ఇప్పటికే చక్కెర ధరలు పెరిగిన సంగతి తెలిసిందే. ఇటు ఇతర కూరగాయల ధరలు కూడా నెమ్మదిగా పెరుగుతున్నాయి. దీంతో వంటింటి ఖర్చు పెరిగి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే, ఇది శ్రావణ మాసం. పైగా వరుసగా పండుగలు జరుపుకొనే సమయం.ఈ సమయంలో ఉల్లి, చక్కెర వంటి నిత్యావసరాల ధరలు భారంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ధరల కట్టడికి కేంద్రం రంగంలోకి దిగింది. దీనిలో భాగంగా కేంద్రం ఉల్లి నిల్వల్ని పెంచుతోంది. ఇందుకోసం మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రత్యేకంగా కంద ఎక్స్‌ప్రెస్ రైలును అనేక ప్రాంతాలకు పంపిస్తోంది. ఈ రైలు నిండా ఉల్లి నిల్వలున్నాయి. మొట్టమొదటగా ఈ రైలు ఢిల్లీ చేరుకుంది. ఈ రైలులో 800 మెట్రిక్ టన్నుల ఉల్లి నిల్వలున్నాయి. దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఉల్లి నిల్వలతో కూడిన రైళ్లను పంపిస్తారు. గత నెల రోజులుగా మార్కెట్‌లోకి ఉల్లి సరఫరా బాగా తగ్గిందని వ్యాపారులు అంటున్నారు. ఉల్లి ధరలు పెరగడానికి కారణం ప్రస్తుత ఖరీఫ్ పంట ఆలస్యం కావడమే. ఇప్పుడు మార్కెట్లో ఉన్న ఉల్లి రబీ పంట ద్వారా వచ్చింది. ఈ పంట నిల్వలు ఇప్పుడు పూర్తవుతున్నాయి. అయితే, ఖరీఫ్ ఆలస్యం కావడం వల్ల ఉల్లి దిగుబడి ఇంకా రాలేదు. దీంతో ధరలు పెరుగుతున్నాయి. మార్కెట్ వర్గాల ప్రకారం సెప్టెంబర్‌తోపాటు అక్టోబర్‌లో కూడా ఉల్లి ధరల పెరుగుదల ఉండే అవకాశం ఉంది. ఖరీఫ్ పంట దిగుబడి వచ్చే వరకు ధరల పెరుగుదల ఉంటుంది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో ఉల్లి కిలో ధర సగటున రూ.42 వరకు పలుకుతోంది. ఢిల్లీలాంటి చోట్ల రూ.65-రూ.70 వరకు ఉంటోంది. ఈ ధరలు ఇంకా పెరిగే ఛాన్స్ ఉంది. ఇదే సమయంలో చక్కెర ధరలు కూడా ఇటీవల పెరుగుతున్న సంగతి తెలిసిందే.

# రష్యాలో దిగిన అమెరికా యుద్ధ విమానం..

**సమాచారం లేదన్న రష్యా ప్రభుత్వం**




న్యూఢిల్లీ ఆగస్టు -25:(వార్త సంధ్య )
అమెరికాకు చెందిన యుద్ధ విమానం రష్యాలో దిగడం సంచలనం కలిగిస్తోంది. అమెరికా-రష్యాల మధ్య ఉన్న వైరం గురించి తెలిసిందే. అలాంటిది, అమెరికాకు చెందిన యుద్ధ విమానం ఇప్పుడు రష్యాలోని మాస్కోలో ల్యాండ్ అవ్వడం ఆసక్తి కలిగిస్తోంది. విమానాల రవాణాను ట్రాక్ చేసే ఫ్లైట్‌రాడార్24 సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. ద బోయింగ్ సి-17 గ్లోబ్‌మాస్టర్ అనే అమెరికాకు చెందిన యుద్ధ విమానం రష్యాలోని మాస్కోలో ల్యాండ్ అయింది.భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ విమానం ల్యాండ్ అయినట్లు తెలుస్తోంది. ఇది ఈ రోజు ఉదయం లాట్వియా దేశంలోని రిగా నుంచి బయల్దేరింది. ఇది సైనిక రవాణా విమానం. అమెరికా, వాషింగ్టన్ డీసీలోని స్ప్రింగ్స్ ఎయిర్‌బేస్ క్యాంప్ నుంచి ఆగష్టు 23న ఈ విమానం బయల్దేరి రిగా వెళ్లింది. అక్కడి నుంచి ఇప్పుడు రష్యా చేరుకుంది. ఉక్రెయిన్, రష్యా మధ్య ఇటీవల మళ్లీ యుద్ధం తీవ్రరూపం దాల్చిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో రెండు దేశాల మధ్య శాంతి కోసం ఇంతకుముందు అమెరికా చేసిన ప్రయత్నాలు నిలిచిపోయాయి. అయితే, ఈ అంశంపై చర్చించేందుకు అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవెన్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్ త్వరలో రష్యా రావాల్సి ఉంది. ఈ చర్చల్లో భాగంగానే అమెరికా విమానం రష్యా వచ్చిందా అనే సందేహాలున్నాయి. అయితే, దీనిపై అమెరికా నుంచి ఇంకా ఎలాంటి ప్రకటనా రాలేదు. మరోవైపు ఈ విమానం గురించిన సమాచారం తమకు కూడా తెలియదని రష్యా ప్రభుత్వం తెలిపింది. అది కార్గో విమానమా, ప్యాసింజర్ విమానమా అనేది కూడా తెలియదని పేర్కొంది. అమెరికా ప్రతినిధులు రష్యాను సందర్శించినప్పుడు లేదా కీలక సందర్భాల్లో మాత్రమే అమెరికా యుద్ధ విమానాలు రష్యా వెళుంటాయి. చివరగా గత జనవరిలో అమెరికా ప్రతినిధులు రష్యాలో పర్యటించినప్పుడు మాత్రమే ఒక అమెరికన్ యుద్ధ విమానం రష్యా వెళ్లింది. మళ్లీ ఇప్పుడు మరో విమానం రష్యాలో ల్యాండ్ అయింది. ఇప్పుడు రెండు దేశాల నుంచి దీనిపై స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది.

# ఇరాన్‌పై అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధించిన అమెరికా..

**-ఎదుర్కొనేందుకు సిద్ధమన్న టెహ్రాన్**



న్యూఢిల్లీ ఆగస్టు -25:(వార్త సంధ్య )
ఇరాన్‌పై మొన్నటి వరకు భౌతిక దాడులకు పాల్పడిన అమెరికా ఇప్పుడు రూటు మార్చింది. సరికొత్త ఆంక్షల పేరుతో టెహ్రాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని యోచిస్తున్నది. ఇందులో భాగంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ఇరాన్‌పై చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ప్రకటించారు. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌క్యాస్ట్' పేరుతో ఈ కొత్త ఆంక్షల ప్యాకేజీని ప్రకటించారు. ఇరాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. టెహ్రాన్‌పై ఇది ఒక 'ఆర్థిక డి-డే' లాంటిదని హెచ్చరించారు. డిజిటల్ ఆస్తులు, టెక్నాలజీ, బంగారం, విమానయానం, నౌకా రవాణా వంటి కీలక రంగాలను ఈ ఆంక్షల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఇతర దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.దీంతో పాటు ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధం ఉన్న 60కి పైగా వ్యక్తులు, కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో ఆర్థిక పోరులో ఇది చివరి అంకమని అమెరికా ప్రకటించింది. ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవాలని ప్రపంచ దేశాల నాయకులను కోరారు. మీరు మా వైపు ఉంటారా లేక మాకు వ్యతిరేకంగా ఉంటారా" అని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న సుమారు 60 సంస్థలు, విదేశీ నౌకలపై అమెరికా నిఘా పెట్టింది. సహకరించే ఇతర దేశాలకూ ఆంక్షల భయం ఉంటుందని తెలిపారు. ఇరాన్‌తో ఆర్థికంగా భాగస్వామ్యం వహించే ఏ దేశమైనా ఏకాకిగా మిగిలిపోతుందని బెసెంట్ తెలిపారు. యూఎస్ ప్రకటనపై ఇటు ఇరాన్ ప్రభుత్వం కూడా ఘాటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కొవడానికి మా వద్ద రెండేండ్ల ప్రణాళిక ఉందని, ప్రతీకార దాడులు తప్పవని బదులిచ్చింది. ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదనీజాదేహ్ మాట్లాడుతూ.. "అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు మేం సర్వసన్నద్ధంగా ఉన్నాం. శత్రువులు మాపై ఆర్థిక ఉగ్రవాద దాడికి పాల్పడాలని చూస్తున్నారు. కానీ, మా వద్ద కూడా తగిన సాధనాలు ఉన్నాయి. ఇకపై మాది కేవలం రక్షణే కాదు, శత్రువులు మా దాడి కోసం ఎదురుచూడాలి" అని హెచ్చరించారు. అమెరికా ఆంక్షలను చైనా, రష్యా అంగీకరించలేదని, ఇతర దేశాలు కూడా ప్రతిఘటిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహసెన్ రెజాయ్ మరింత ఘాటుగా స్పందించారు. అమెరికాకు సహకరించే ఏ దేశమైనా 'భూకంపం లాంటి' ప్రతీకారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పొరుగు దేశాలు సహకరిస్తే పర్షియన్ గల్ఫ్ లేదా హార్ముజ్ జలసంధి నుంచి చుక్క నూనె కూడా బయటకు వెళ్లనివ్వబోమని తేల్చిచెప్పారు. కాగా, ఇరాన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాలపై ప్రభావం చూపుతున్నది. పెరిగిన చమురు ధరలు జీవన వ్యయంపై ఆందోళనలను పెంచాయి. పెట్రోల్,డీజిల్ ధరలు ఏడాది క్రితం కంటే చాలా ఎక్కువగా ఉండంతో అమెరికాతో పాటు అన్ని దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. మరో వైపు ఇరాన్‌పై ఆంక్షలను ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు స్వాగతించారు.

vaartha sandhya వార్త సంధ్య తెలుగు దిన పత్రిక నిజం నిర్భయంగా మీ ముందుకు vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

# యశోద హాస్పిటల్స్ కు ప్రతిష్టాత్మక గుర్తింపు

-ప్రపంచస్థాయి ఈసీఎంవో సేవల్లో మరో ఘనత




**నంద్యాల ప్రతినిధి, ఆగస్టు -25:(వార్త సంధ్య )** ప్రపంచస్థాయి అత్యవసర వైద్య సేవలు, ట్రాన్స్‌ప్లాంట్ కేర్‌లో విశేష సేవలందిస్తున్న హైదరాబాద్ యశోద హాస్పిటల్స్‌కు ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. అత్యున్నత ప్రమాణాలతో ఈసీఎంవో సేవలు అందిస్తున్నందుకు ఈఎల్ఎస్ వో నుంచి ప్లాటినం సర్టిఫికేషన్ పొందింది. ఈ గుర్తింపుతో భారతదేశంలో ఈఎల్ఎస్ఓ నుంచి ప్లాటినం స్థాయి గుర్తింపు పొందిన ప్రముఖ ఈసీఎంవో కేంద్రాల్లో యశోద హాస్పిటల్స్ ఒకటిగా నిలిచింది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఆధునిక లైఫ్ సపోర్ట్ అందించడంలో ఆసుపత్రి వైద్య బృందం అనుసరిస్తున్న అంతర్జాతీయ ప్రమాణాలకు ఈ గుర్తింపు నిదర్శనమని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

అత్యాధునిక ఈసీఎంవో సేవలు యశోద హాస్పిటల్స్‌లో వీఏ, వీవీ, ఈసీపీఆర్ వంటి వివిధ రకాల ఈసీఎంవో చికిత్సలను అందుబాటులో ఉంచినట్లు యశోద హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ నిశాంత్ పేర్కొన్నారు. పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. గుండె, ఊపిరితిత్తులు తదితర అవయవాల పనితీరు తీవ్రంగా దెబ్బతిన్న రోగులకు ఈసీఎంఓ ద్వారా అవసరమైన లైఫ్ సపోర్ట్ అందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం క్రిటికల్ కేర్ వైద్యులు, కార్డియోథొరాసిక్ సర్జన్లు, పెర్ఫ్యూషనిస్టులు, ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు, ప్రత్యేక శిక్షణ పొందిన ఐసియు నర్సులతో కూడిన బహుళ విభాగాల వైద్య బృందం సేవలందిస్తోందన్నారు. ట్రాన్స్‌ప్లాంట్ కేర్‌తో సమన్వయం, అత్యాధునిక సేవలతో పాటు గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, ఎముక మజ్జ తదితర అవయవ మార్పిడి సేవలను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఎక్మో సేవలను ట్రాన్స్‌ప్లాంట్ కార్యక్రమాలతో అనుసంధానం చేయడం ద్వారా అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న రోగులకు మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

అలాగే తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులను వేగంగా, సురక్షితంగా ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.

రోగుల ప్రాణ రక్షణే లక్ష్యం: ఈఎల్ఎస్వో ప్లాటినం గుర్తింపు, తమ వైద్య బృందం పాటిస్తున్న అత్యున్నత క్లినికల్ ప్రమాణాలకు గుర్తింపు అని డాక్టర్ నిశాంత్ పేర్కొన్నారు. ఎక్మో వంటి అత్యంత సంక్లిష్టమైన లైఫ్ సపోర్ట్ చికిత్సలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అందిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో రోగుల ప్రాణాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచస్థాయి ఎక్మో, క్రిటికల్ కేర్, ట్రాన్స్‌ప్లాంట్ సేవలను ఒకే వేదికపై అందిస్తూ యశోద హాస్పిటల్స్ వైద్య రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించిందని ఆసుపత్రి ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ నిర్వాహకులు సుమంత్ రెడ్డి, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాలయం లో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్



**మంత్రాలయం ఆగస్టు -25:(వార్త సంధ్య )** : మంత్రాలయంలో మంగళవారం రాష్ట్ర మంత్రులు సందడి చేశారు. రాఘవేంద్ర స్వామి మూల బృందావనం దర్శనార్థం మంత్రాలయం చేరుకున్న మంత్రుల నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి. రవికుమార్ లకు, స్థానిక తెదేపా మంత్రాలయం నియోజకవర్గ ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర్రెడ్డి, కర్నూలు జిల్లా ఎంపీ నాగరాజు, మంత్రాలయం నియోజకవర్గం జనసేన ఇన్చార్జి వాల్మీకి లక్ష్మన్న, బిజెపి ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి, ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి తమ్ముళ్లు రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి రెడ్డిలు ఇతర కూటమి నేతలు మంత్రులకు ఘనంగా స్వాగతం పలికారు మంత్రాలయం శ్రీమఠం చేరుకున్న వీరికి మేనేజర్ ఎస్ కే శ్రీనివాసరావు ఇతర అధికారులతో కలిసి పూలమాలతో స్వాగతం పలికారు. ముందుగా గ్రామదేవత శ్రీ మాంచాలమ్మ దేవికి కుంకుమార్చన నిర్వహించి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామీజీ క్షేత్ర చరిత్రను మంత్రులకు వివరించి చేసి శేష వస్త్రం ఫలమంత్ర అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు.

# ద్రాక్షాయణి సిద్ధేశ్వరాలయ అభివృద్ధికి రూ. 2 లక్షల విరాళం

-గోళ్ళ రాజేష్ దాతృత్వానికి ప్రత్యేక అభినందనలు తెలిపిన ప్రజలు







**నంద్యాల ప్రతినిధి, ఆగస్టు -25:(వార్త సంధ్య )** నంద్యాల వాసి, ప్రముఖ దాత, వ్యాపార వేత్త గోళ్ళ రాజేష్ చూపిన ఉదారత, దైవభక్తి స్థానికుల్లో గొప్ప స్ఫూర్తిని నింపాయి. నిర్మాణ దశలో ఉన్న ద్రాక్షాయణి సమేత సిద్ధేశ్వర ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మంగళవారం గోళ్ళ రాజేష్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సాయంగా రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధి ఉమాకాంతయ్యకు రాజేష్ అందజేశారు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ మాట్లాడుతూ ఆలయాల నిర్మాణం, అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావడం మన పూర్వజన్మ సుకృతమన్నారు. కేవలం ఈ ఆర్థిక సహాయంతోనే ఆగిపోకుండా భవిష్యత్తులో కూడా ఆలయ పురోగతికి, భక్తుల సౌకర్యార్థం ఎలాంటి అవసరాలు వచ్చినా తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు గోళ్ళ రాజేష్ దాతృత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు. స్వామివారి దివ్య ఆశీస్సులు ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆలయ కమిటీ తరపున వారికి ప్రత్యేక పూజలు చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటువంటి మహోన్నతమైన సేవా గుణం సమాజంలో మరికొందరికి ఆదర్శం కావాలని స్థానికులు కొనియాడారు.

# స్థానిక సమరానికి సిద్ధం కండి





-సమావేశంలో ఏపీ మంత్రులు

-రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మాధవరంలో కూటమి మంత్రులు, శ్రేణులు భేటీ






**మంత్రాలయ ఆగస్టు -25:(వార్త సంధ్య )** : స్థానిక సమరానికి సిద్ధం కావాలని ఏపీ మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్ కూటమి నాయకులకు, శ్రేణులకు పిలుపునిచ్చారు. మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మాధవరంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ కూటమి పార్టీల ఇన్‌చార్జ్‌లతో, కేడర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా జలవనరుల శాఖ మంత్రి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో టీడీపీ జెండా ఎగరేసి రాఘవేంద్ర రెడ్డికి మంచి పేరు తీసుకురావాలని, విద్యుత్ శాఖ పరంగా ఏ సహాయం కావాలన్నా చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రాయలసీమ సాగు, తాగునీటి ప్రాజెక్టులకు ఎన్టీఆర్ పునాదులు వేస్తే చంద్రబాబు పూర్తి చేశారని, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ, గండికోట, గోరుకల్లుకు టీడీపీయే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. 2019లో 52కు 49 సీట్లు ఇచ్చినా వైసీపీ ఐదేళ్లలో ఇరిగేషన్‌లో సున్నా చుట్టిందని, 2014-19లో రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే 2019-24లో కేవలం రూ.2 వేల కోట్లే ఖర్చు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో రూ.27 వేల కోట్లు ఖర్చు చేసిందని, ఇందులో 50 శాతం రాయలసీమకే కేటాయించిందన్నారు. శ్రీశైలం మరమ్మతులకు రూ.201 కోట్లు, గోరుకల్లుకు రూ.60 కోట్లు, గురు రాఘవేంద్ర మోటార్ల బకాయిలు, మెయింటెనెన్స్‌కు రూ.17 కోట్లు క్లియర్ చేస్తామని, వేదావతికి రూ.1,600 కోట్లతో 2029 నాటికి పూర్తి చేస్తామని, హంద్రీ-నీవా ద్వారా 3,800 క్యూసెక్కులు తరలిస్తూ నీవా బ్రాంచ్‌కు రూ.1,300 కోట్లు, మడకశిర బ్రాంచ్‌కు రూ.700 కోట్లతో శంకుస్థాపన చేశామన్నారు. గుండ్రేవుల, ఆర్డీఎస్-రాజోలిబండ, గాజులదిన్నె సహా కర్నూలు పశ్చిమ ప్రాంత ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

# క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది- మంత్రి ఫరూక్

- నంద్యాలలో ఘనంగా దైవసేవకుల ఆత్మీయ అవగాహన సదస్సు








**నంద్యాల ప్రతినిధి, ఆగస్టు -25:(వార్త సంధ్య** నంద్యాల పట్టణం ఎస్ఆర్‌బీసీ కాలనీలోని బెతెస్త తెలుగు బాప్తిస్టు ప్రార్థన మందిరంలో 'క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అసోసియేషన్' ఆధ్వర్యంలో మంగళవారం దైవసేవకుల ఆత్మీయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవ సమాజ సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. సమాజంలో శాంతి, సమానత్వం, సేవా భావాన్ని పెంపొందించడంలో దైవసేవకుల పాత్ర ఎంతో ప్రశంసనీయమన్నారు. క్రైస్తవులకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ప్రతినిధులు క్రైస్తవుల సంక్షేమం, ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మంత్రి ఫరూక్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న , టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు, టీడీపీ క్రిస్టియన్ సెల్ పట్టణ అధ్యక్షులు బిషప్ డా. కె. బాలచంద్రుడు, వాక్యోపదేశకులు బిషప్ డా. ఇమ్మానుయేలు సన్నిధి, రెవ. డా. మారివూరి నాగేంద్రబాబు, తోట్టెంపూరి చంద్రశేఖర్, రెవ. ఇటికిల మల్లికార్జున, పాస్టర్ రాజేష్, పాస్టర్ అన్నపురెడ్డి రాజేష్, పాస్టర్ వై. రమేష్ బాబు, పాస్టర్ ఆశీర్వాదం, పాస్టర్ టి. యోనాతాన్, పాస్టర్ అశోక్ కుమార్, పాస్టర్ పి. జాషువా, పాస్టర్ కిషోర్ కుమార్, బుగ్గ రాముడు , మరాఠీ సూరి, సంఘ పెద్దలు, దైవసేవకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలి

"మిలాద్ ఉన్ నబీ " శుభాకాంక్షలు తెలిపిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్



**అమరావతి, ఆగస్టు -25:(వార్త సంధ్య )** ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సంతోషం, ఆరోగ్యం, సౌభాగ్యం నిండాలని కోరుకుంటూ అందరికీ మిలాద్ ఉన్ నబీ పర్వదిన శు భాకాంక్షలను మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.ముస్లిం సమాజంలో ఎంతో పవిత్రంగా భావించే పండుగల్లో మిలాద్ ఉన్ నబీ ఒకటని మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని స్మరించుకుంటూ ఈ రోజును భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. ప్రవక్త మహమ్మద్ జీవితాన్ని, బోధనలను పాటిస్తూ, ఆదర్శంగా నిలవాలని అన్నారు.నిజాయితీ, దయ, క్షమ, ప్రేమ, సహనం, ఇతరులకు సహాయం చేయడం వంటి విలువలకు ప్రవక్త ఇచ్చిన ప్రాధాన్యతను ఆదర్శంగా తీసుకోవాలని కోరుతూ మిలాద్ ఉన్ నబీ శు భాకాంక్షలు మంత్రి ఫరూక్ తెలిపారు.

# వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి





**చిట్వేల్, ఆగస్టు -25:(వార్త సంధ్య )** వినాయక చవితి వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు ఉత్సవ కమిటీలకు సూచించారు. ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ సూచనలు, పర్యవేక్షణలో కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, పెనగలూరు ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి పెనగలూరు మండలంలోని వివిధ గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. వినాయక విగ్రహాలు, మండపాల ఏర్పాటుతో రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదన్నారు. వేడుకల్లో రాజకీయ ప్రచారం, వివాదాస్పద నినాదాలు, బ్యానర్లు, జూదం, లక్కీడ్రాలు, మద్యం, బలవంతపు విరాళాల వసూళ్లకు తావివ్వకూడదని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా పోలీసులు సూచించిన మార్గం, సమయం, ప్రదేశాన్ని పాటించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే లేదా వివాదాస్పద సమాచారాన్ని ప్రచారం చేయవద్దని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనివాసులు కోరారు.

# అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ 'హైవాన్' ట్రైలర్ రిలీజ్.. విలన్‌గా అక్షయ్!




బాలీవుడ్ స్టార్ హీరోలు అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ 'హైవాన్'. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్ విలన్‌గా కనిపించబోతుండగా, సైఫ్ అలీ ఖాన్ అంధుడి పాత్రలో నటిస్తున్నాడు. అక్షయ్ ఒక వైపు అంధుడైన సైఫ్‌ను వేటాడే తీరు, వీరిద్దరి మధ్య సాగే ఉత్కంఠభరితమైన పిల్లి-ఎలుకల ఆట ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉంది. ఈ చిత్రంలో బొమన్ ఇరానీ జడ్జిగా, సయామి ఖేర్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. శ్రియా పిగ్లోంకర్, షరీబ్ హష్మి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ మరియు దిస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ సస్పెన్స్ డ్రామాను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026 న థియేటర్లలో విడుదల చేయనున్నారు.




## చీరకట్టులో శృతిమించిన హెబ్బా పటేల్ గ్లామర్

# బికినీలో కృతిసనన్ రక్షాబంధన్ సెలబ్రేషన్స్

### ఏకి పడేసిన నటి, ఎంపి కంగనా రనౌత్

కృతి సనన్ ఇటీవల నటించిన ఓ యాడ్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇప్పటికే నెట్టింట విమర్శలు రాగా.. బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ తాజాగా మండిపడ్డారు. రక్షా బంధన్ అంటే ప్రతి సోదరికీ ఎంతో ప్రత్యేకమైన రోజు. అంత గొప్ప సమయంలో హుందాగా కనిపించాలి. ఈ సాంప్రదాయ పండగకు సంబంధించిన ప్రకటనలో ఇలాంటి దుస్తులా ధరించేది. ఈ రోజుల్లో మహిళలకు లెహంగాలు, జీన్స్, సల్వార్ కమీజ్, చీరలు, పంజాబీ డ్రెస్‌లు.. ఇన్ని రకాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా.. ఇలాంటి బికినీ ధరించి రాఖీ ఎందుకు కడతారు?. ఈ యాడ్ చేసిన స్టైలిష్ట్‌కు ఈ ఆప్షన్లు కనిపించలేదా? ఈ యాడ్ ఉద్దేశపూర్వకంగా చేసినట్లుంది. చాలా అసహ్యంగా కనిపిస్తోందని తన ఇన్‌స్టాలో రాసుకొచ్చారు. ఇటీవల విడుదలైన ఈ యాడ్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా కృతిని ట్రోల్ చేస్తున్నారు. డ్రెస్‌తో పాటు.. ఈ యాడ్‌లో పెంపుడు కుక్కకు రాఖీ కడుతూ కృతి కనిపించడంతో విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. ఈ యాడ్‌పై ఇప్పటి వరకూ యాజమాన్యం, కృతి సనన్ స్పందించలేదు.



# నేడు విడుదలవుతున్న టాక్సిక్

### -టిక్కెట్ రేట్ల పెంపునకు తెలంగాణలో అనుమతి




కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' ఆగస్టు 26 ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు హోమ్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్ థియేటర్లలో జీఎస్టీతో కలుపుకుని రూ. 50, అలాగే మల్టీప్లెక్స్‌లు మరియు స్పెషల్ థియేటర్లలో రూ. 100 వరకు అదనంగా టికెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతిని ఇచ్చారు. పెంచిన ధరలు సినిమా విడుదలైన రోజు నుంచి సెప్టెంబర్ 4 వరకు పది రోజుల పాటు అమలులో ఉంటాయి. అలాగే ఈ పది రోజుల పాటు రోజుకు అదనంగా ఒక షోతో కలుపుకుని మొత్తం 5 షోలు ప్రదర్శించుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ధరల పెంపుతో పాటు మరికొన్ని కీలక నిబంధనలను కూడా ఖరారు చేసింది. సినీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అకౌంట్‌కు నిర్మాణ సంస్థ 'కేవీఎన్-మాస్టర్ మైండ్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ' తక్షణమే రూ. 1 కోటి విరాళంగా అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిధులను పూర్తిగా సినీ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయనున్నారు. అలాగే, సినిమా ప్రదర్శన సమయంలో మాదకద్రవ్యాలు, నార్కోటిక్స్ మరియు సైబర్ క్రైమ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించే ప్రత్యేక ప్రకటనలను తప్పనిసరిగా ప్రదర్శించాలని థియేటర్ల యాజమాన్యాలను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనలన్నీ ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు మరియు సినిమా లైసెన్సింగ్ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. టాక్సిక్' చిత్రాన్ని తెలంగాణలో ప్రముఖ నిర్మాత, పంపిణీ దారుడు, ఎఫ్.డి.సి. ఛైర్మన్ దిల్ రాజు విడుదల చేస్తున్నారు.

# దేశ విభజన నేపథ్యంలో బట్వారా 1947

### పేలవ ప్రదర్శనతో ఆకట్టులోకపోయిన చిత్రం....




సన్నీ డియోల్ హీరోగా దేశ విభజన గాథ నేపథ్యంలో ఆమిర్ ఖాన్ నిర్మించిన 'బట్వారా 1947' చిత్రం ఆగస్ట్ 14న విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ బరిలో చాలా పేలవమైన ప్రభావాన్ని చూపించింది. దీనికి ముందు ఇదే తరహాలో వచ్చిన 'మై వాపస్ ఆవుంగా' దీనికంటే బెటర్ గా పెర్ఫార్మ్ చేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'బట్వారా' చిత్రంతో ఆమిర్ ఖాన్‌కు దాదాపు 90 కోట్ల నష్టం వచ్చిందని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పుడీ సినిమా ఓటీటీ డీల్ సందిగ్ధంలో పడింది. నిజానికి సినిమా రిలీజ్ కు ముందు ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ రూ. 125 కోట్లను ఆఫర్ చేసిందట. కానీ అప్పుడు అందుకు ఆమిర్ ఖాన్ అంగీకరించలేదని తెలిసింది. ఇప్పుడు సినిమా విడుదలై పరాజయం పాలు కావడంతో ఏ ఓటీటీ ప్లాట్ ఫామ్ కూడా దీని హక్కులపై ఆసక్తి చూపడం లేదట. 'బట్వారా' సినిమా విడుదలకు ముందే ఓటీటీ డీల్ కుదర్చుకోమని, ఆ కారణంగా ఆర్థికంగా ఉపయోగపడుతుందని ఆమిర్‌కు సన్నీడియోల్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఆయన దానిని ఖండించారు. తమ మధ్య ఓటీటీ డీల్‌కు సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదని ఆయన అన్నారు. 'బట్వారా' సినిమా విషయంలో తాను గర్వం పడుతుంటానని, బాక్సాఫీస్ ఫలితాలు సినిమా క్వాలిటీని ప్రతిఫలించవని ఆయన తెలిపారు. తన తండ్రి కెరీర్ లో హృషికేశ్ ముఖర్జీ తీసిన 'సత్యకామ్' ఉత్తమ చిత్రంగా తాను భావిస్తానని, కాని ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ పరాజయాన్ని చవిచూసిందని సన్నీ డియోల్ చెప్పారు. అయితే 'బట్వారా' నష్టాలు రాబోయే రోజుల్లో భర్తీ అవుతాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.